ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
3
అనకాపల్లి
జిల్లా వార్తలు
శనివారం 2 ఆగస్టు 2025



5 ఐటీ సంస్థలకు భూ కేటాయింపులు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- రుషికొండ, మధురవాడల్లో ఏఎన్ఎస్ఆర్‌కు 10.29 ఎకరాలు
- రూ.1,000 కోట్ల పెట్టుబడి, పది వేల మందికి ఉద్యోగాలు
- సిఫీ ఇన్ఫినిటీ స్పేస్‌కు రుషికొండ, పరదేశీపాలెంలో 53.6 ఎకరాలు

-6లో

రైతుకు ఆర్థిక ఆసరా!

నేడు అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభం



- జిల్లాలో 2,42,536 మంది రైతులు అర్హులు
- ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున రూ.121,26,80,000 సాయం
- 2,00,915 మందికి పీఎం కిసాన్ యోజన
- రూ.2 వేల చొప్పున రూ.40,18,30,000 సాయం
- ఒక్కో రైతు బ్యాంకు ఖాతాలో రూ.7 వేలు జమ

అనకాపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీల్లో మరో ప్రధానమైన 'అన్నదాత సుఖీభవ' పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శనివారం శ్రీకారం చుట్టనున్నది. అర్హులైన రైతులకు పెట్టుబడి సాయం అందించనున్నది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ యోజన్‌తో అనుసంధానం చేస్తూ ఏటా మూడు విడతల్లో ఒక్కో రైతుకు రూ.20 వేల చొప్పున నగదు ఇవ్వనున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలివిడత రూ.7 వేలు (రాష్ట్రం రూ.5 వేలు, కేంద్రం రూ.2 వేలు) సాయాన్ని శనివారం నుంచి ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నది. ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకానికి 2,42,536 మంది రైతులను అర్హులుగా గుర్తించారు. ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.121,26,80,000 రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనున్నది. ఈ పథకం కింద జిల్లాలో అత్యధికంగా బుచ్చెయ్యపేట మండలంలో 14,377 మంది రైతులు, అత్యల్పంగా పరవాడ మండలంలో 4,866 మంది లబ్ధి పొందనున్నారు. అదే విధంగా పీఎం కిసాన్ యోజనకు జిల్లాలో 2,00,915 మంది రైతులను అర్హులుగా నిర్ధారించారు. ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున రూ.40,18,30,000 కేంద్ర ప్రభుత్వం విడుదల చేయనున్నది. జిల్లాలో అత్యధికంగా బుచ్చెయ్యపేట మండలంలో 11,978 మంది, అత్యల్పంగా పరవాడ మండలంలో 4,018 మందికి సాయం అందనున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిగిలిన రూ.13 వేలను ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా రెండు విడతల్లో (డిసెంబరులో రూ.7 వేలు, వచ్చే ఏడాది మార్చిలో రూ.6 వేలు) రైతులకు అందజేస్తాయి. మొత్తం మీద ఒక్కో రైతుకు ఏటా రూ.20 వేల చొప్పున లబ్ధి చేకూరనున్నది.

మండలం	అన్నదాత సుఖీభవ అర్హులు	సొమ్ము	పీఎం కిసాన్ అర్హులు	సొమ్ము
అనకాపల్లి	13,604	రూ.6.8 కోట్లు	11,179	రూ.2.24 కోట్లు
కశింకోట	8,710	రూ.4.36 కోట్లు	7,177	రూ.1.44 కోట్లు
చోడవరం	12,974	రూ.6.49 కోట్లు	10,732	రూ.2.15 కోట్లు
బుచ్చెయ్యపేట	14,377	రూ.7.19 కోట్లు	11,978	రూ.2.4 కోట్లు
రావికమతం	13,313	రూ.6.66 కోట్లు	11,115	రూ.2.22 కోట్లు
రోలుగుంట	10,625	రూ.5.31 కోట్లు	8,858	రూ.1.77 కోట్లు
కె.కోటపాడు	11,121	రూ.5.56 కోట్లు	9,206	రూ.1.84 కోట్లు
చీడికాడ	9,844	రూ.4.92 కోట్లు	8,185	రూ.1.64 కోట్లు
దేవరాపల్లి	10,227	రూ.5.11 కోట్లు	8,537	రూ.1.71 కోట్లు
మాడుగుల	14,163	రూ.7.08 కోట్లు	11,756	రూ.2.35 కోట్లు
గొలుగొండ	7,182	రూ.3.59 కోట్లు	5,944	రూ.1.19 కోట్లు
నర్సీపట్నం	8,147	రూ.4.07 కోట్లు	6,753	రూ.1.35 కోట్లు
నాతవరం	10,743	రూ.5.37 కోట్లు	8,953	రూ.1.79 కోట్లు
మాకవరపాలెం	8,988	రూ.4.49 కోట్లు	7,501	రూ.1.5 కోట్లు
కోటవురట్ల	10,413	రూ.5.21 కోట్లు	8,688	రూ.1.74 కోట్లు
నక్కపల్లి	11,806	రూ.5.9 కోట్లు	9,798	రూ.1.96 కోట్లు
పాయకరావుపేట	7,129	రూ.3.56 కోట్లు	5,876	రూ.1.18 కోట్లు
ఎస్.రాయవరం	9,975	రూ.4.99 కోట్లు	8,256	రూ.1.65 కోట్లు
పరవాడ	4,866	రూ.2.43 కోట్లు	4,018	రూ.0.8 కోట్లు
సబ్బవరం	10,598	రూ.5.3 కోట్లు	8,612	రూ.1.72 కోట్లు
అచ్యుతాపురం	8,204	రూ.4.1 కోట్లు	6,718	రూ.1.34 కోట్లు
మునగపాక	9,016	రూ.4.51 కోట్లు	7,461	రూ.1.49 కోట్లు
ఎలమంచిలి	8,442	రూ.4.22 కోట్లు	6,943	రూ.1.39 కోట్లు
రాంబిల్లి	8,069	రూ.4.03 కోట్లు	6,671	రూ.1.33 కోట్లు
మొత్తం	2,42,536	రూ.121.27 కోట్లు	2,00,915	రూ.40.18 కోట్లు

ఉల్లంగనులు!

ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. మైనింగ్ మాఫియా హవా

- నిబంధనలకు విరుద్ధంగా క్వారీల నిర్వహణ
- అనుమతులు లేకుండా బ్లాస్టింగులు
- సమీప గ్రామాల్లో భూ ప్రకంపనలు
- నివాసాలపై పడుతున్న రాళ్లు
- కమ్మేస్తున్న దుమ్ము, ధూళి
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు
- అక్రమార్కులకు కూటమి నేతల అండదండలు?



అనకాపల్లి మండలం మార్టూరులో సర్వే నంబర్-1లో అనుమతులు లేని క్వారీ

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో వున్నప్పటికీ జిల్లాలో మైనింగ్ మాఫియా అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోతున్నది. వివిధ ప్రభుత్వ శాఖల నుంచి కనీస అనుమతులు పొందకుండా కొండలను పిండి చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నల్లరాయి క్వారీలు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన ఓ నాయకుడి అనుచరుడు జిల్లాలో మైనింగ్‌ను తన కనుసన్నల్లో నడిపించారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా.. అక్రమ మైనింగ్, అనధికార బ్లాస్టింగులు కొనసాగుతూనే వున్నాయి. అప్పట్లో వైసీపీ నాయకులు, ఇప్పుడు కూటమి నేతలు మైనింగ్ మాఫియాకు అండగా నిలవడమే కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో 252 రోడ్డు మెటల్, బిల్డింగ్ స్టోన్, గ్రావెల్ క్వారీలకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. కానీ అనధికారికంగా 650కిపైగా నల్లరాయి క్వారీలు నిర్వహిస్తున్నారు.



అనకాపల్లి మండలం మామిడిపాలెం సమీపంలోని క్వారీలో పేలుళ్లతో ఎగిసి పడుతున్న ధూళి

మొక్కుబడిగా తనిఖీలు

అనధికార నల్లరాయి క్వారీలు, బ్లాస్టింగులపై స్థానికులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. సంబంధిత అధికారులు మొక్కుబడిగా తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. మొక్కుబడిగా ఒకటి, రెండు వాహనాలను పట్టుకొని జరిమానా వేసి వదిలేస్తున్నారు. జిల్లాలో అనధికార నల్లరాయి క్వారీలపై ఇటీవల గనుల శాఖ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి అశోక్‌కుమార్ పలు క్వారీల్లో తనిఖీలు చేశారు. కొందరికి జరిమానా విధించారు. దీంతో మైనింగ్ అక్రమార్కులకు అండగా వుండే స్థానిక నాయకులు రంగంలోకి దిగి ఫిర్యాదు చేసిన వ్యక్తులను బెదిరిస్తున్నారు. అనకాపల్లి మండలం కుంచంగి ప్రాంతంలో ఒక అనధికార క్వారీపై స్థానికులు కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, టీడీపీ నేత ఒకరు సదరు ఫిర్యాదుదారినికి ఫోన్ చేసి, ఆ క్వారీ జోలికి పోవద్దని హెచ్చరించారు. ఈ ఆడియో సోషల్ మీడియాలో హల్ చేసింది.

ఇదిలావుండగా అనకాపల్లి మండలం మార్టూరు, సీహెచ్ఎన్ అగ్రహారం, మాకవరం, మామిడిపాలెం, తుమ్మపాల పరిసరాల్లో పదుల సంఖ్యలో అనధికార నల్లరాయి క్వారీలు ఉన్నాయి. రాత్రి, పగలు అన్న తేడా లేకుండా జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లతో పేలుళ్లు జరుపుతున్నారు. వాస్తవానికి నల్లరాయి క్వారీల్లో బ్లాస్టింగ్ చేయాలంటే పర్యావరణ, గనులు, రెవెన్యూ, పోలీసు శాఖల అనుమతులు తప్పనిసరి. కానీ వైసీపీ హయాంలో జిల్లాకు చెందిన ఒక మంత్రి, పలువురు ఎమ్మెల్యేల దన్నుతో క్వారీల్లో యథేచ్ఛగా బ్లాస్టింగులు నిర్వహించారు. ఇప్పుడు కూటమి నేతలు కూడా అదే బాటలో నడుస్తూ, క్వారీల్లో బ్లాస్టింగులకు తమవంతు 'సహకారం' అందిస్తున్నారు. క్వారీల్లో భారీ పేలుళ్ల కారణంగా చుట్టుపక్కల గ్రామాల్లో భూకంపం వచ్చిందా.. అన్నట్టు ప్రకంపనలు వస్తున్నాయి. పెద్ద ఎత్తున రాళ్లు, దుమ్ము, ధూళి ఎగిసిపడుతున్నాయి. క్వారీలకు ... మిగతా 6వ పేజీలో



నాతవరం మండలం గునుపూడిలో వితంతువుకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ఎన్టీఆర్ భరోసా పింఛన్ సొమ్ము 93.08 శాతం మందికి పంపిణీ

అనకాపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ తొలిరోజు శుక్రవారం 93.08 శాతం పూర్తయ్యింది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ శచీదేవి విడుదల చేసిన వివరాల ప్రకారం జిల్లాలో 2,58,120 మంది ఎన్టీఆర్ భరోసా పింఛన్‌దారులు ఉండగా.. ఆగస్టు నెలలో పంపిణీ కోసం ప్రభుత్వం రూ.108.91 కోట్లు విడుదల చేసింది. సచివాలయాల సిబ్బంది గురువారమే ఆయా బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసి, శుక్రవారం ఉదయం ఆరు గంటల నుంచి పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి డబ్బులు పంపిణీ చేశారు. పలుచోట్ల కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయంత్రం ఆరు గంటల వరకు 2,40,267 (93.08 శాతం) మందికి నగదు పంపిణీ చేశారు. ఇళ్లకు తాళాలు వేసిన వున్న వారికి మాత్రమే పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది. నాతవరం మండలం గునుపూడిలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, అనకాపల్లి మండలం పిసినికాడలో కలెక్టర్ విజయకృష్ణన్ పింఛన్ పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు డబ్బులు అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

మరొకరికి తీవ్ర గాయాలు

- ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొన్న వ్యాన్
- అనకాపల్లి కొత్తూరు జంక్షన్ వద్ద ఘటన
- మృతులు సిమెంట్ ఫ్యాక్టరీ ఉద్యోగులు
- సహచర ఉద్యోగి పెళ్లికి వెళ్లి వస్తుండగా దుర్ఘటన
- ఒకరిది గొలుగొండ, మరొకరిది చినయాదగిరిపాలెం



ప్రమాదానికి కారణమైన వ్యాన్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):

జాతీయ రహదారిపై అనకాపల్లి పట్టణ శివారు కొత్తూరు జంక్షన్ సమీపంలో శుక్రవారం తెల్లవారు జామున ద్విచక్ర వాహనాన్ని, ఐషర్ వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ అందించిన వివరాలిలా ఉన్నాయి.



వెంకట సూరిఅప్పారావు (ఫైల్ ఫొటో)



నాగసాయి బాలాజీ (ఫైల్ ఫొటో)

గొలుగొండ మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన గండెం నాగసాయి బాలాజీ (25) కశింకోట మండలంలోని ఓ సిమెంట్ కంపెనీలో ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. మునగపాక మండలం చినయాదగిరిపాలెం గ్రామానికి చెందిన మేడిశెట్టి వెంకట సూరిఅప్పారావు (28) ఇదే కంపెనీలో సూపర్‌వైజర్‌గా, గాజువాకకు చెందిన పైనా రవి క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. కశింకోటలో ఒక గది అద్దెకు తీసుకుని వుంటున్నారు. గురువారం రాత్రి తాళ్లపాలెంలో సహచర ఉద్యోగి వివాహ వేడుకకు హాజరయ్యారు. తెల్లవారు జామున మూడున్నర గంటల సమయంలో అక్కడి నుంచి ద్విచక్ర వాహనంపై అనకాపల్లి వచ్చి, తిరిగి కశింకోట వెళుతున్నారు. కొత్తూరు జంక్షన్ సమీపంలో విశాఖ వైపు నుంచి వస్తున్న ఐషర్ వ్యాన్, ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొన్నది. తరువాత డ్రైవర్ వ్యాన్‌ను ఆపకుండా వెళ్లిపోయాడు. ఈ ప్రమాదంలో వెంకట సూరిఅప్పారావు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడిన నాగ సాయి బాలాజీ, రవిలను స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. చికిత్స పొందుతూ నాగసాయి ... మిగతా 6వ పేజీలో

ఆడబిడ్డల ఉచిత ప్రయాణానికి కసరత్తు

ఈ నెల 15 నుంచి అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం

- జీరో ఫేర్ టికెట్ జారీపై సిబ్బందికి శిక్షణ
- జిల్లాలో రోజూ 25 వేల మందికిపైగా మహిళలు ప్రయాణించే అవకాశం



మహిళలకు జారీ చేసే ఉచిత ప్రయాణం టికెట్ నమూనా

నర్సీపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఆరోదైన ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని ఈ నెల 15వ తేదీ నుంచి అమలు చేయనున్న నేపథ్యంలో అధికారులు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు. మహిళా ప్రయాణికులకు జీరో ఫేర్ టికెట్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉచిత ప్రయాణం కోసం మహిళలు ఏదైనా గుర్తింపు కార్డు చూపించాల్సి ఉంటుంది. దీనిని పరిశీలించిన కండక్టర్, మహిళల నుంచి ఎటువంటి చార్జీ వసూలు చేయకుండా జీరో ఫేర్ టికెట్ ఇస్తారు. ఎక్కడ నుంచి ఎక్కడకు ప్రయాణం చేస్తున్నారు, టికెట్ ధర, ప్రభుత్వం ఇస్తున్న రాయితీ, చెల్లించాల్సింది జీరో అని ముద్రించి ఉంటుంది. జీరో ఫేర్ టికెట్ ఎలా జారీ చేయాలన్నదానిపై కండక్టర్లు, డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్నారు. టికెట్లు జారీ చేసే టిమ్ మిషన్లలో సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేశారు. జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం డిపోలకు చెందిన 184 బస్సుల్లో రోజూ సుమారు. 25 వేల మంది మహిళలు ప్రయాణిస్తున్నట్టు అధికారులు అంచనా వేశారు. ఉచిత ప్రయాణ పథకం అమల్లోకి వచ్చిన తరువాత ఈ సంఖ్య కొంతమేర పెరిగే అవకాశం వుందని అంటున్నారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేయవచ్చు.



ఆర్టీసీ బస్సులో మహిళా ప్రయాణికులు

రాంకీ యాజమాన్యంపై పీసీబీ చైర్మన్ ఆగ్రహం

ఘన వ్యర్థాల నిర్వహణ తీరుపై అసహనం

పరవాడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఫార్మా ఘన వ్యర్థాల నిర్వహణ తీరుపై ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య, రాంకీ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ఫార్మాసిటీలో రాంకీకి చెందిన కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (సీడబ్ల్యూఎంపీ), కోస్టల్ ఎన్విరాన్‌మెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (సీఈటీపీ)లను అధికారులతో కలిసి తనిఖీ చేశారు. సీడబ్ల్యూఎంపీ షెడ్ల వెనుక ప్రదేశంలో నిబంధనలకు విరుద్ధంగా వందల టన్నుల ఘన వ్యర్థాలు నిల్వ ఉండడంపై ఆయన మండిపడ్డారు. పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి విఘాతం కలిగించేలా వ్యవహరించవద్దని హెచ్చరించారు. లోపాలను వెంటనే సరి చేసుకోవాలని సూచించారు. ఫార్మా వ్యర్థాలతో కలుషితంగా మారిన పరవాడ ఉరచెరువు, మల్లోడి వాగు, పరవాడ పెద్ద చెరువును సందర్శించారు. ఆయన వెంట పీసీబీ ఆర్‌డీ సుదర్శన్, ఈఈ ముకుందరావు, సిబ్బంది వున్నారు.



రాంకీ సీఈటీపీలో అధికారులతో మాట్లాడుతున్న ఏపీ పీసీబీ చైర్మన్ పి.కృష్ణయ్య (పసుపు రంగు క్యాప్ పెట్టుకున్న వ్యక్తి)

కుప్పగా మందులు!

- కాలం చెల్లకుండానే పారబోసిన 104 సిబ్బంది



పాయకరావుపేట పీహెచ్‌సీ పాత భవనంలో పడేసిన మందులు

పాయకరావుపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజారోగ్యం కోసం ఏటా కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంటే.. రోగులకు ఉచితంగా వైద్య సేవలు, మందులు అందించాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారు. నక్కపల్లి మండలం గొడిచెర్ల పీహెచ్‌సీకి చెందిన మందులను గడువుతీరకుండానే 104 వాహన సిబ్బంది పాయకరావుపేట పీహెచ్‌సీ ఆవరణలో చెత్తగా పడేయడం ఇందుకు నిదర్శనం. సుమారు ఐదు అట్టపెట్టెల్లో ఉన్న చిన్న పిల్లలకు ఇచ్చే దగ్గు మందుతోపాటు ఇతర మందులను నెల రోజుల క్రితమే ఇక్కడ ఆస్పత్రి పాత భవనంలో పడేసినట్టు తెలిసింది. వీటిల్లో చాలా మందులకు ఇంకా గడువు వుంది. దీనిపై పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుభాష్‌ని వివరణ కోరగా... ఆస్పత్రి ఆవరణలో మందులు పడిఉన్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. ఇవి నక్కపల్లి మండలం గొడిచెర్ల పీహెచ్‌సీ పరిధిలోని సబ్ సెంటర్లకు 104 వాహన సిబ్బంది పంపిణీ చేయాల్సినవిగా గుర్తించినట్టు చెప్పారు. వీటిని వెంటనే తీసుకెళ్లిపోవాలని 104 సిబ్బందిని ఆదేశించామన్నారు.

మత్స్యకారుల పంట పండింది

- పెద్ద సంఖ్యలో గేలాలకు చిక్కిన ట్యూనా చేపలు

అచ్యుతాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో చేపల వేటకు వెళ్లిన పూడిమడక మత్స్యకారుల పంట పండింది. శుక్రవారం భారీగా సూర చేపలు (ట్యూనా ఫిష్) గేలాలకు చిక్కాయి. మత్స్యకారులు శుక్రవారం తెల్లవారుజామున సుమారు వంద పడవల్లో చేపల వేటకు వెళ్లారు. మధ్యాహ్నం తరువాత ఒక్కొక్కబోటు తీరానికి చేరుకు న్నది. ప్రతి బోటులో పెద్ద పెద్ద సూర చేపలు కనిపించాయి. ఒక్కొక్కటి 20 నుంచి 30 కిలోల బరువు వుంది. ఎగుమతి వ్యాపారులు కిలో రూ.175 చొప్పున కొనుగోలు చేశారు. ఈ ఏడాది జూన్‌లో చేపల వేట పునరుద్ధరణ తరువాత ఇంత పెద్ద సంఖ్యలో ట్యూనా చేపలు లభించడం ఇదే ప్రథమమని మత్స్యకారులు ఆనందంతో చెప్పారు.



పూడిమడక తీరంలో ట్యూనా చేపలు

పేదల బతుకుల్లో పింఛన్ల ద్వారా వెలుగు

▸ ఎమ్మెల్యే సుందరపు, రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ

ఎలమంచిలి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమ ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మునిసిపాలిటీలోని కాకివాని వీధిలో స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పింఛన్ నగదు పెంపు కూటమి ప్రభుత్వంలోనే సాధ్యమైందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఏవిధంగా పెంచిందో అందరికీ తెలిసిందేనని వివరించారు. పింఛన్ల ద్వారా పేదల బతుల్లో వెలుగులు నిండుతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ సందీప్, మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, కూటమి నాయకులు పిట్టా శ్రీను, గొర్లె నానాజీ, బొద్దపు శ్రీను, కరణం రవి, ఊటకూటి రమేష్ నాయుడు, కొఠారు శ్రీను, గుర్రాల శేఖర్ పాల్గొన్నారు.



ఎలమంచిలిలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు, చిత్రంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్

అప్పారాయుడుపాలెంలో...

రాంబిల్లి : మండలంలోని అప్పారాయుడుపాలెంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే విజయ్‌కుమార్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సాధించిన విజయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, ఎంపీడీవో జయమాధవి, వెలుగు ఏపీఎం పద్మ, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు వి.దినబాబు, జనసేన పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, కూటమి నాయకులు కొఠెడ్డి ప్రసాద్, లాలం తాతబాబు, నానేపల్లి నాగేశ్వరరావు, బద్ది మహేష్, నానేపల్లి సాయివరప్రసాద్, సీరా వెంకటరావు, బాబి, సన్యాసిరావు, ఎరిపల్లి అజయ్, చెల్లూరి ఆనంద్, ఉమ్మిడి నాగేష్, కర్రి సింహగిరి ప్రసాద్, గబ్బర్‌సింగ్, నాని, సత్యనారాయణ పాల్గొన్నారు. రాజుకోడూరు, అప్పారాయుడు గ్రామాలలో తారు రోడ్ల పనులను ఎమ్మెల్యేతో పాటు ప్రగడ ప్రారంభించారు.

మునగపాకలో...

మునగపాక : పేదవారికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఆసరగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే సుందరపు, రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ న్నారు. మునగపాకలో కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేసి మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాలన సాగిస్తున్నట్టు చెప్పారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, మాదిగ, గవర కార్పొరేషన్ల డైరెక్టర్లు డొక్కా నాగభూషణం, భీమరశెట్టి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ ఆడారి మంజు, కూటమి నాయకులు టెక్కలి పరశురాం, పెంటకోట విజయ్, దొడ్డి శ్రీనివాసరావు, బొడ్డేడ అప్పలనాయుడు, దాడి ముసిలినాయుడు, సత్యనారాయణ పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో...

అచ్యుతాపురం : పింఛన్ల పంపిణీ మండలంలో పండుగ వాతావరణంలో సాగింది. కొత్తగా 213మందికి వితంతు పింఛన్లు మంజూరు కావడంతో వాటిని ఎమ్మెల్యే విజయ్‌కుమార్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు పంపిణీ చేశారు. పెదపాడులో మాజీ జడ్పీటీసీ జనపరెడ్డి శ్రీనివాసరావు, మడుతూరులో జనసేన ఉమ్మడి జిల్లాల కార్యదర్శి మోటూరు శ్రీవేణి, ఎర్రవరంలో కూటమి నాయకులు అగ్గాల హనుమంతరావు, తగుడేల కనకారావు పంపిణీ చేశారు. ఈకార్యక్రమాల్లో భైలపూడి శ్రీరామదాసు, శనివాడ ఆనందరావు, ప్రగడ నాగేశ్వరరావు, ద్వారపురెడ్డి బాపూజీ, ధర్మిరెడ్డి నాయుడుబాబు, లాలం నాగేశ్వరరావు, కూనిశెట్టి రమణ, బీపే రమణ పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆలయాలకు పోటెత్తిన భక్తులు

ఎలమంచిలి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ శుక్రవారం సందర్భంగా మండలంలోని అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రధానంగా పద్మనాభరాజుపేటలో గల దుర్గాదేవి ఆలయంలో వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. తొలుత అమ్మవారిని విశేషంగా అలంకరించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సర్పంచ్ గొన్నాబత్తుల శివలక్ష్మి, శివ దంపతులు అన్నసమారాధనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మొగ్గ గోవిందరావు, ఎడ్ల పెద గోవిందరావు, పాల సంఘం మాజీ అధ్యక్షుడు కరిపిరెడ్డి జోగారావు, మొగ్గ బుజ్జి, జెర్రిపోతుల నానాజీ, ఆర్.వెంకట్ పాల్గొన్నారు.



పీఎన్ఆర్‌పేటలో విశేష అలంకరణలో దుర్గామాత

వైభవోపేతంగా సుదర్శన నారసింహ హోమం



తిమ్మరాజుపేటలో శాస్త్రోక్తంగా హోమాన్ని జరిపిస్తున్న అర్చకులు

మునగపాక, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) :మండలంలో తిమ్మరాజుపేటలో నిర్మాణంలో ఉన్న కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో శుక్రవారం సుదర్శన నారసింహ హోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాకినాడ రంగమానుజ ఆశ్రమం నుంచి విచ్చేసిన వేద పండితులు విష్ణు, మాధవన్, శ్రీధర్‌లు శాస్త్రోక్తంగా ఈ వేడుకను జరిపించారు. ఆలయ కమిటీ చైర్మన్ శరగడం రామేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి, మాజీ ఎంపీపీ ఆడారి మంజు, కమిటీ కార్యదర్శి ఆనంద్ బిహారీలాల్‌తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే పిల్లలకు ఆరోగ్యం

▸ మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి/మునగపాక/అచ్యుతాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : బిడ్డకు పాలు ఇవ్వడం వలన తల్లీబిడ్డ ఇద్దరూ ఆరోగ్యకరంగా ఉంటారని మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి అన్నారు. శుక్రవారం పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆవరణలో సీడీ పీవో ఇందిరాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల ప్రారంభోత్సవంలో మాట్లాడారు. తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమైనవన్నారు. అనంతరం తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తూ సీహెచ్‌సీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యాధికారిని డాక్టర్ నిహారిక, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే, మునగపాక మండలంల గణపర్తి గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ కె.అన్నపూర్ణ పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలుతో పాటు కూటమి నాయకులు కాళ్ళ చంద్రమోహన్, ఎం.వి.రమణ, ఆడారి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా అచ్యుతాపురంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ కె.శ్రావ్య మాట్లాడుతూ తల్లి పాల ఆవశ్యకతను గ్రామీణులకు అంతా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు జి. సుహాసిని, రాజేశ్వరితో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పొంగిన మత్స్యకార కుటుంబాలు

▸ పూడిమడకలో నలుగురు యువకులు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపిక



చోడిపల్లి కృష్ణప్రసాద్



మేరుగు అచ్యుతరావు



చోడిపల్లి యశ్వంత్



ఎరిపల్లి వసంతరావు

అచ్యుతాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకార కుటుంబాలకు చెందిన నలుగురు యువకులు పోలీస్ కానిస్టేబుళ్లుగా ఎంపిక కావడంతో ఆ గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ ఫలితాలను హోం మంత్రి వంగల పూడి అనిత, డీజీపీ శుక్రవారం విడుదల చేశారు. మండలంలోని పూడిమడకకు చెందిన చోడిపల్లి కృష్ణప్రసాద్, మేరుగు అచ్యుతరావు, చోడిపల్లి యశ్వంత్, ఎరిపల్లి వసంతరావులు ఎంపికయ్యారు.వీరంతా 2010-11 విద్యా సంవత్సరంలో డిగ్రీ ఉత్తీర్ణులయ్యారు. నిరుపేద మత్స్యకార కుటుంబాలకు చెందిన వీరికి వేట సాగితేనే కడుపు నిండేది. అయినప్పటికీ కష్టపడి పిల్లలను ఆయా తల్లిదండ్రులు చదివించడంతో వారు చక్కగా చదువుకుని ఉద్యోగాలు సాధించారు. దీంతో గ్రామ పెద్దలతో పాటు గ్రామస్థులు వీరిని అభినందించారు.

చినయాదగిరిపాలెంలో విషాదఛాయలు

▸ కొత్తూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామ యువకుడు మృతి

మునగపాక, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెలుపాక పంచాయతీ శివారు చినయాదగిరిపాలెంలో విషాదఛాయలు అలముకున్నాయి. వివాహ వేడుకకు వెళ్లిన కొడుకు ఇంకా రాలేదని ఎదురు చూసిన తల్లిద్రండ్రులు పిడుగులాంటివార్త వినాల్సి వచ్చింది. అనకాపల్లి దరి కొత్తూరు జంక్షన్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో చినయాదగిరిపాలేనికి చెందిన మేడశెట్టి వెంకటసూరి అప్పారావు మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడు వెంకటసూరిఅప్పారావు తల్లిదండ్రులు లోవరాజు, లక్ష్మి వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. కుమారుడికి వివాహం చేయాలనే ఆలోచనలో ఉన్నారు. ఇంతలో ఈ దుర్ఘటన జరిగింది.

నేటి నుంచి కుళాయిల ద్వారా యథాతథంగా తాగునీరు

ఎలమంచిలి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలోని అన్ని ప్రాంతాలకు శనివారం నుంచి యథాతథంగా కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా కానుందని ఏఈ గణపతి సుబ్బారావు తెలిపారు. మోటారు, పైప్‌లైన్లు పాడవ్వడంతో గత నాలుగురోజులగా కుళాయిల ద్వారా నీటి సరఫరా జరగలేదన్నారు. యర్రవరం పోలిమేరమ్మ ఆలయం సమీపంలో దెబ్బతిన్న పైప్‌లైన్‌కు మరమ్మతులు పూర్తి కావడంతో అన్ని ప్రాంతాలకు నీరు అందనుందన్నారు.

ఎలమంచిలి తాలూకా ప్రభుత్వ పింఛనర్ల అసోసియేషన్ కమిటీ



ప్రమాణం చేస్తున్న కమిటీ సభ్యులు

ఎలమంచిలి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి తాలూకా రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల అసోసియేషన్ నూతన కమిటీ శుక్రవారం ఇక్కడ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా మరోసారి సిహెచ్.సోమేశ్వరరావు, గౌరవాధ్యక్షునిగా కె.వందనం, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కె.ఎస్.సన్యాసిరావు, జనరల్ సెక్రటరీగా జి.సాంబమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.చిట్టిబాబు, ట్రెజరర్‌గా కె.కామేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా బి.నరసింహమూర్తి, ఏపీజే జగన్నాథం, ఎన్.సూర్యనారాయణ, జాయింట్ సెక్రటరీలుగా వి.లక్ష్మణరావు, జి.సత్యనారాయణ, ఎస్ఎస్ఎస్.మణి ఎన్నికయ్యారు. మరి కొందరిని ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎన్నుకున్నారు. అనంతరం ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కె.సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో తపాలా మేళా



పోస్టల్ సేవలు తెలియజేస్తున్న అధికారి

రాంబిల్లి, ఆగస్టు (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి బ్రాంచి పోస్టాఫీసు ఆధ్వర్యంలో శుక్రవారం తపాలా మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టల్ బ్యాంక్ వలన కలిగే ప్రయోజనాలు సదరు అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎల్.నాయుడు, ఎం.ఐ.నాయుడు, ఐపీపీబీ అసిస్టెంట్ మేనేజర్ శివ, బ్రాంచ్ స్థానిక పోస్టుమాస్టర్ జగన్నాథరాజు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ

▸ నక్కపల్లిలో మోనటరింగ్ సెల్ ఏర్పాటు



మోనటరింగ్ సెల్‌లో పింఛన్ల పంపిణీ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న అధికారులు

నక్కపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నది. ప్రతి నెలా 1వ తేదీ తెల్లవారుజామునే పంపిణీ ప్రక్రియను ప్రారంభిస్తున్నది. అంతేకాకుండా లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా పెన్షన్లు ఇవ్వాలని ఆదేశించింది. దీనికితోడు మండల పరిషత్ కార్యాలయంలో పెన్షన్ల పంపిణీని పరిశీలించేందుకు, తాజా సమాచారం తెలుసుకోవడానికి మోనటరింగ్ సెల్ కూడా ఏర్పాటు చేసింది. ఈ ప్రక్రియపై ఎంపీడీవో సీతారామరాజు సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కాగా, పలు గ్రామాల్లో ఎంపీడీవోతో పాటు ఈవోపీఆర్‌డీ చలపతిరావు శుక్రవారం పెన్షన్లను పంపిణీ చేశారు. గొడిచెర్లలో మాజీ వైస్ ఎంపీపీ వైబోయిన రమణ, ఉపమాకలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కొప్పిశెట్టి బుజ్జి, సర్పంచ్ ప్రగడ వీరబాబు లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు.

ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలని ఆందోళన



ప్రజాభిప్రాయ సేకరణ వద్దంటూ నిరసన తెలుపుతున్న రైతులు

నక్కపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో బల్క్‌డ్రగ్ పార్కుకు సంబంధించి ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వాసిత రైతులు శుక్రవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎం.లోకనాథం, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైసీపీ మండల అధ్యక్షుడు శీరం నరసింహమూర్తి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అప్పలరాజు వీరికి సంఘీభావం తెలిపారు. సారిపల్లివానిపాలెం హైవే జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నేత లోకనాథం మాట్లాడుతూ బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు కోసం తయారు చేసిన పర్యావరణ ప్రభావిత నివేదిక లోపభూయిష్టంగా వుందని, వాస్తవాలను వక్రీకరించారని ఆరోపించారు. అనంతరం డీటీ నారాయణరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లొడగల చంద్రరావు, వై.తాతబాబు, జి.బాబూరావు, ఎం.రాజేశ్, ఎరుపల్లి, ఎం.మహేశ్‌బాబు, పిక్కితాతీలు, చొక్కా కాశీ, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయాలకు భక్తుల తాకిడి

నక్కపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవారి ఆలయాలు శుక్రవారం భక్తులతో కళకళలాడాయి. ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు అమ్మవారికి అష్టోత్తర శతనామార్చన చేశారు. దుర్గమ్మ ఆలయంలో అర్చకుడు వెలవలపల్లి మహేశ్ భక్తుల గోత్రనామాలతో పూజా కార్యక్రమాలు చేశారు. నక్కపల్లి, బంగారమ్మపేట, చినదొడ్డిగల్లు గ్రామాల్లో దుర్గమ్మ ఆలయాలను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. రేబాక గూడుపమ్మతల్లి ఆలయంలో ఉపమాక శ్రీనివాసా భజన భక్త సమాజం గాయకులు ఆలపించిన గీతాలు అలరించాయి. ఆలయ ధర్మకర్త శ్రీహరిరాజు భజన గురువు, గాయకులను సన్మానించారు.

పండుగలా సామాజిక పింఛన్ల పంపిణీ

పలువురు వితంతువులకు కొత్త పెన్షన్ల మంజూరు

పాయకరావుపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల్లో పింఛన్ల పంపిణీ ప్రక్రియ శుక్రవారం పండుగలా జరిగింది. ఈ నెల కొంత మందికి కొత్త పింఛన్లు మంజూరు కావడంతో, వారిలో ఆనందం రెట్టింపైంది. పాయకరావుపేట పట్టణం, మండలంలో కొత్త పింఛన్ల పంపిణీ ప్రక్రియను కూటమి నాయకులు ఉత్సాహంగా నిర్వహించారు. పట్టణంలో టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు పింఛన్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిధుల కొరత ఉన్నప్పటికీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను ప్రభుత్వం ఒక్కొక్కటీ అమలు చేస్తున్నదన్నారు. మండలంలో ఈ నెల కొత్తగా 299 వితంతు పింఛన్లు మంజూరవగా, అన్ని రకాల పింఛన్లు కలిపి 12,864 మందికి రూ.5.33 కోట్లు పంపిణీ చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెల రాజబాబు, నాయకులు ఎం.వెంకట రమణ, పి.విలియంకేరి, ప్రసాద్, జి.నాగు, వి.అప్పారావు, సిహెచ్.పేర్రాజు, ముంజులూరి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పాయకరావుపేటలో వితంతు పింఛన్ పంపిణీ చేస్తున్న నాయకులు



ఎస్.రాయవరం: గోకులపాడులో పెన్షన్ అందిస్తున్న జ్యోతికుమార్, కార్తీక్

ఎస్.రాయవరంలో...

ఎస్.రాయవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. గోకులపాడు గ్రామంలో నూతనంగా మంజూరైన వితంతు పెన్షన్‌లను శుక్రవారం సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో జనసేన పార్టీ మండల యూత్ ప్రెసిడెంట్ లింగంపల్లి జ్యోతి కుమార్, మండల ఉపాధ్యక్షుడు మత్తి కార్తీక్ చేతుల మీదగా పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 224 నూతన వితంతు పెన్షన్‌లు మంజూరైనట్టు ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. నూతనంగా మంజూరైన పెన్షన్‌లను గ్రామాల్లో గల కూటమి నాయకుల చేతుల మీదగా లబ్ధిదారులకు పంపిణీ అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు నక్కా శ్రీనివాసు, టీడీపీ నాయకుడు సమ్మెంగి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కోటవురట్లలో...

కోటవురట్ల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జల్లూరు, సుంకపూర్ గ్రామాల్లో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. జల్లూరులో సర్పంచ్ లాలం పద్మావతి, మాజీ సర్పంచ్ చిటికెల భాస్కరరావు ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. అలాగే వారి కష్టాసుఖాలను అడిగి తెలుసుకున్నారు. బీకేపల్లిలో టీడీపీ మండల అధ్యక్షుడు పెట్ల లింగం నాయుడు, పంచాయతీ కార్యదర్శ రఘురామ్ పింఛన్లు పంపిణీ చేశారు. కోటవురట్లలో టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు పి.సూర్యరావు, సర్పంచ్ అనిల్‌కుమార్ సంతబయిల ముస్లింవీధిలో పింఛన్లు పంపిణీ చేశారు.



కోటవురట్ల: సుంకపూర్‌లో పింఛన్లు అందిస్తున్న లాలం కాశీనాయుడు

మత్స్యకారులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

పాయకరావుపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రసాయన పరిశ్రమల వల్ల సముద్ర జలాలు కలుషితమై మత్స్య సంపద తగ్గి ఉపాధి కోల్పోతున్న మత్స్యకారులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని జాతీయ మత్స్యకార సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.నగేశ్‌బాబు, ఏపీ రాష్ట్ర అధ్యక్షులు మోసా అప్పలరాజు కోరారు. ఈ మేరకు అమరావతిలో రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ వివరాలను మోసా అప్పలరాజు శుక్రవారం స్థానిక విలేకరులకు అందించారు. తీర ప్రాంతాల్లో విషపూరితమైన పరిశ్రమల వల్ల మత్స్యకారులకు ఆరోగ్య సమస్యలు తలెత్తుండడంతో పాటు సముద్ర జలాలు కలుషితమై మత్స్య సంపద గణనీయంగా తగ్గిపోతున్నందున ఉపాధి కోల్పోతున్నారన్నారు. అందువల్ల మత్స్యకారులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ వర్తింపచేసి సాయం అందించాలని, 90 శాతం రాయితీపై తెప్పలు, వలలు, ఇంజన్లు పంపిణీ చేయాలని, పలు సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో జాతీయ మత్స్యకార సంఘానికి చెందిన రాష్ట్రంలోని అన్ని జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారన్నారు.



మత్స్య శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సంఘం ప్రతినిధులు

తల్లి పాలు బిడ్డకు అమృతం



రాట్నాపాలెంలో తల్లులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమావతి

కోటవురట్ల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తల్లి పాలు బిడ్డకు అమృతమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమావతి అన్నారు. మండల కేంద్రం కోటవురట్ల శివారు రాట్నాపాలెం గొల్లపేట వద్ద అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాలు వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంపూర్ణ పోషణ్‌ను గర్భవతులు బాలితంతులు వినియోగించుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు దూరంగా ఉన్న బాలింతలు, గర్భవతులు ప్రతి రోజూ వచ్చి పోషకాహారం తీసుకోవాలంటే ఇబ్బందిగా ఉంటుందని, అందువల్ల లబ్దిదారుల ఇంటికే సరకులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలని కార్యకర్తలు బాలింతలు, గర్భిణులకు తల్లిపాలు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని, ఇందుకోసం ర్యాలీలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తల ఎస్తేరు రాణి, గర్భిణుల, బాలింతలు పాల్గొన్నారు.

'గ్రావెల్ దందాను అరికట్టడంలో అధికారులు విఫలం'

ఎస్.రాయవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రావెల్ దందాను అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ ఆరోపించారు. పెదగుమ్ములూరు రెవెన్యూలోని మేడికొండ వద్ద గ్రావెల్ అక్రమ తవ్వకాల ప్రదేశాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ కొండ వద్ద ఉన్న డీ పట్టా భూములను పరిశీలించడానికి వెళ్లగా, అక్కడ పెద్దఎత్తున గ్రావెల్ తవ్వకాలు జరిగిన ప్రదేశం కంటపడిందన్నారు. గ్రావెల్ దొంగలు ఎక్స్‌కవేటర్ల సాయంతో తవ్వుతూ ట్రాక్టర్‌లతో అక్రమంగా తరలించి పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోకోపవడం దారుణమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాల నిరోధానికి తగిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

రోటరాక్టు క్లబ్ నూతన కార్యవర్గం

పాయకరావుపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో రోటరాక్టు క్లబ్ అఫ్ యంగ్ లీడర్స్, క్లబ్ ఆఫ్ సబల నూతన కార్యవర్గాలు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశాయి. రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ కల్యాణ్ చక్రవర్తి గౌరవ అతిథిగా హాజరయ్యారు. రోటరాక్ట్ క్లబ్ యంగ్ లీడర్స్ అధ్యక్షుడిగా చంద్రవర్ధన్, సబల అధ్యక్షురాలు అనురాధ తదితరులతో ప్రమాణ స్వీకారం చేయించారు. విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్‌ను జ్ఞాపికతో సత్కరించారు. క్లబ్ ప్రతినిధులు చంద్రవర్ధన్, అనురాధ, నాగిరెడ్డి పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయంలో ప్రత్యేక పూజలు


నూకాంబిక ఆలయంలో కుంకుమ పూజ చేస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబికఆలయంలో శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మండపంలో సాము హికంగా మహిళలు కుంకుమ పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె.ఎల్. సుధారాణి, ఆలయ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి'


హెచ్ఎంల శిక్షణ ముగింపోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు

సబ్బవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అన్నారు. ఇక్కడ దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో నాలుగు రోజులుగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జరిగిన సోషల్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎస్ఎల్‌డీపీ) వృత్యంతర శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి, పాఠశాలల పరిశుభ్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రభుత్వ లక్ష్యానికి అను గుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోన్-1 ఆర్జేడీ విజయ భాస్కర్, డీఈవో జి.అప్పారావునాయుడు, పరిశీలకులు శేషగిరిరావు, కైవలయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు కిడ్నీ రోగులకు ప్రత్యేక వైద్య శిబిరం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : క్వారీల కారణంగా కిడ్నీ వ్యాధు లతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యసేవలందించేందుకు ఎన్టీఆర్ వైద్యాల యం ఎదురుగా ఉన్న ఆసుపత్రిలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించ నున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పరిశీలించారు. శిబిరానికి వచ్చే వారికి ఎటువంటి అసౌకర్యాలు కలగ కుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తుమ్మపాల, కశింకోట, తగరంపూడి పీహెచ్‌సీల పరిధిలో క్వారీల కారణంగా 137 మంది బాధపడుతున్నారని గుర్తిం చామని డాక్టర్ పృథ్వీ తెలిపారు. వీరందరికీ ఇప్పటికే పరీక్షలు జరిపామని, మరో సారి స్కానింగ్ తీసి అవసరమైన చర్యలు చేపడతామన్నారు. ఈ వైద్య శిబిరా నికి నెఫ్రాలజిస్ట్, జనరల్ ఫిజీషియన్ వైద్య నిపుణులతో పాటు ఎన్టీఆర్ వైద్యాల యం సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు తదితరులు హాజరు కానున్నార న్నారు. ఈ శిబిరాన్ని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

'మాజీ ఎమ్మెల్యే ఇంటి ముట్టడి కేసు కొట్టివేత'

తుమ్మపాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : అగ్రిగోల్డ్ ఏజెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు 2019లో అప్పటి ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఇంటి ముట్టడి కేసును కోర్టు కొట్టివేయడం ఆనందదాయకమని సీపీఐ పట్టణ కార్యదర్శి వైఎన్ భద్రం అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులంతా కలిసి పీలా గోవిందసత్యనారాయణకు వినతిపత్రం అందించేం దుకు అతని ఇంటికి వెళ్లారన్నారు. దీంతో అప్పటి పోలీసులు కేసు నమోదు చేసి నట్టు చెప్పారు. అయితే సరైన ఆధారాలు లేకపోవడం వల్ల అనకాపల్లి 11వ మెట్రోపాలిటన్ కోర్టులో కేసు కొట్టేశారని వివరించారు. ఈ మేరకు అనకాపల్లి న్యాయస్థానాల భవన సముదాయం ముందు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో అగ్రిగోల్డ్ బాధితుల సంఘం ప్రతినిధులు కరణం మాణిక్యాలరావు, మొల్లేటి గోపాల రమణ, కోన లక్ష్మణ, ఎన్నంశెట్టి సూరిబాబు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంపై కూలీలకు అవగాహన


ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొత్తూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం సీతానగరంలో ఉపాధి హామీ పథకంపై కూలీలకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుంకర చంటి మాట్లాడుతూ వలసల నిరో ధానికి, గ్రామంలోనే ఉపాధి కల్పించేందుకు ఈ బృహత్కార్యక్రమాన్ని ప్రభు త్వాలు అమలు చేస్తున్నాయన్నారు. వీటిని అర్హులంతా సద్వినియోగం చేసుకోవా ల్సిందిగా కోరారు. ఎస్ఆర్‌పీ దాసు మాట్లాడుతూ కూలీలకు కల్పిస్తున్న సౌక ర్యాలు, హక్కులు తదితరాలను వివరించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సుప్రియ, కార్యదర్శి మౌనిక, కూటమి నాయకులు రమణ, ప్రసాదరావు, తాతారావు, నర్సింగరావు, గణేష్, గోవింద, వీర బాబు, తరుణ్, సోషల్ ఆడిట్ సిబ్బంది శ్రీను, సురేష్ పాల్గొన్నారు.

పరవాడలో పొంచి ఉన్న ప్రమాదం

▸▸ కూలేందుకు సిద్ధంగా విద్యుత్ స్తంభం



గ్రామీణ వికాస్ బ్యాంకు వద్ద ఉన్న స్తంభం అడుగు భాగం దుస్థితి

పరవాడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ ప్రధాన రహ దారిలోని గ్రామీణ వికాస్ బ్యాంకు వద్ద ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. తుప్పు పట్టి స్తంభం అడుగు భాగంలో రంధ్రాలు ఏర్పడ్డాయి. గత కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు భయాందోళన చెం దుతు న్నారు. స్తంభం అడుగుభాగం చుట్టూ సపోర్ట్‌గా సిమెంట్‌ను నిర్మించక పోవడం వల్లే ఈ సమస్య తలెత్తినట్టు చెబుతున్నారు. ప్రధాన రహదారికి ఆనుకొని ఈ స్తంభం ఉండడంతో పెద్ద ఎత్తున గాలి వీస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని పలువురు హడలిపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


సబ్బవరం మండలం మొగలిపురంలో నగదు అందిస్తున్న గండి బాబ్జీ


గవరపాలెంలో పింఛన్ పంపిణీ చేస్తున్న సురేంద్ర


పెదరామస్వామి కోవెల ప్రాంతంలో నగదు అందిస్తున్న రత్నాకర్

ఊరూరా.. పింఛన్ల పండుగ

▸▸ వేకువజామున పంపిణీ ఆరంభం ▸▸ పలువురు ప్రజా ప్రతినిధులు హాజరు ▸▸ ఏడాదిలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు వెల్లడి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ శుక్రవారం వాడవా డలా పండుగ వాతావరణంలో సాగింది. అనకా పల్లిలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, అర్బన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ కూటమి నాయకులతో కలిసి విజయ రామరాజుపేటలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సం దర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభు త్వం అర్హులైన వారికి పింఛన్లు అందించలేదన్నారు. కూట మి ప్రభుత్వం వచ్చాక అర్హులైన వారందరికీ పింఛన్లు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్ర మంలో కూటమి నాయకులు పాల్గొన్నారు. అలాగే 81వ వార్డులోని నిదానందొడ్డి, నెయ్యిలవీధి, సంతోషి మాత ఆలయం, రామునాయుడు కాలనీల్లో గవర కా ర్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర పింఛన్లు పంపిణీ చేశారు. 81వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగజగదీశ్వరరావు పింఛన్లు పంపిణీ చేశారు. గవరపాలెం పెదరామస్వామికోవెల, అంబేడ్కర్‌నగర్ ప్రాంతాల్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దా డి రత్నాకర్ పలువురికి పింఛన్లను అందజేశారు. అనకాపల్లి జీవీఎంసీ జోన్ పరిధిలో మొత్తం 9,657 మంది పింఛనర్లు ఉండగా, వీరందరితో పాటు కొత్తగా మంజూరైన 185 మందికి పింఛన్లను అందజే శారు. ఈ కార్యక్రమాల్లో వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.


కశింకోటలో వృద్ధురాలికి పింఛన్ నగదు అందిస్తున్న ఎమ్మెల్యే కొణతాలు, మాజీ ఎమ్మెల్యే పీలా


81వ వార్డులో పింఛన్ అందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు

కశింకోటలో...

కశింకోట : మండలంలో పింఛన్ల పంపిణీ ఉత్సా హంగా సాగింది. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కశింకోటలో పలువురికి పింఛన్లను అందజేసి మాట్లా డారు. వృద్ధాప్యంలో ఉన్న వారందరికీ కూటమి ప్రభు త్వం ఆర్థిక భరోసా ఇస్తుందని పేర్కొన్నారు. ఇదిలా వుంటే, ఇక్కడి పంచాయతీ కార్యాలయం వద్ద ఎగ్గా ర్దును బుద్ద సుబ్బలక్ష్మి అనే మహిళకు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మండల ప్రత్యేకాధికారిణి లక్ష్మీ సుభాషిణి, ఎంపీడీవో వి.వి.రవికుమార్, డిప్యూటీ ఎంపీడీవో ధర్మారావు, కూటమి నాయకులు వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాస రావు, కాండ్రేగుల సతీష్, వేగి రామకోటి, వేగి వెంక ట్రావు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మపాలెంలో...

పరవాడ : మండలంలోని ముత్యాలమ్మపాలెంలో పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింత కాయల ముత్యాలు పలువురు లబ్ధిదారులకు పింఛ న్లను పంపిణీ చేశారు. సర్పంచ్ చింతకాయల సుజాత, పంచాయతీ కార్యదర్శి రజని, మండల కో-ఆప్షన్ సభ్యుడు ఝిలపల్లి అప్పన్న, కూటమి నాయకులు వొలిశెట్టి అప్పలరాజు, అర్జిల్లి అప్పల రాజు, చింతకాయల అప్పారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొగలిపురంలో...

సబ్బవరం : కూటమి ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని పెందుర్తి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి, ఏపీ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ అన్నారు. కొత్తగా మంజూరైన పింఛన్లను శుక్రవారం మొగలిపురంలో పంపిణీ చేసి మాట్లాడారు. ఎంపీడీవో శివరామ్‌నారాయణ, సర్పంచ్ గండి అరుణ, గ్రామ పెద్దలు తమరాన బంగారునాయుడు, అంగటి నానాజీ, గండి నరేష్, సత్యం, రాంబాబు పాల్గొన్నారు.

లంకెలపాలెం, దేశపాత్రునిపాలెంలలో...

లంకెలపాలెం : నిరుపేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. లంకెలపాలెం, దేశపాత్రునిపాలెం సచివాలయాల పరిధిలో మంజూరైన వితంతు పింఛ న్లు పంపిణీ చేసి మాట్లాడారు. అభివృద్ధి, ప్రజా సంక్షే మానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెద్ద పీటవేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పిల్లా శివకుమార్, మచ్చా శివకుమార్, కోటేశ్వరరావు, రామారావు, పప్పల మూర్తి, అమరపిని శ్రీను, చిన్నారావు, కరణం అప్పారావు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం


తల్లిపాలు విశిష్టతను తెలిపే బ్రోచర్ల ఆవిష్కరణలో, కొణతాల, అధికారులు

తుమ్మపాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అనకాపల్లి ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో స్త్రీ శిశు సంక్షేమశాఖ, మహిళాభివృద్ధి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. తల్లిపాలు బిడ్డకు అందించడం వలన బహుళ ప్రయోజనాలున్నా యన్నారు. బరువు తగ్గడం, రొమ్ము, అండాశయంలో ఏర్పడే క్యాన్సర్ వ్యాధుల నుంచి బయట పడవచ్చునని వివరించారు. అలాగే ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు జరిపి, మెయిన్‌రోడ్డుపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ బీవీ సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.



పరవాడ మండలం వాడచీపురుపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

వాడచీపురుపల్లిలో...

పరవాడ : వాడచీపురుపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వైద్యాధికారిణి ఫాతిమాబే గం మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను వివరించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణి, వైద్య సిబ్బంది, అంగన్ వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రం అందజేత


మంజూరు పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

సబ్బవరం, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి) : బంగారమ్మ పాలెంలో అనారోగ్యానికి గురైన దాడి రోహిత్‌కుమార్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.రెండు లక్షల మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యానికి గురైన ఎందరికో ముఖ్య మంత్రి సహాయనిధి బాసటగా నిలుస్తున్నట్టు చె ప్పారు.ఈ కార్యక్రమంలో కర్రి కనకరాజు, దొడ్డి సూర్య ప్రకాశరావు, దాడి శివ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయ కార్యనిర్వహణాధికారిగా తిలక్‌బాబు

అనకాపల్లి రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీస్ కార్యాలయంలో కార్యనిర్వహణాధికారిగా సీహెచ్.తిలక్‌బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్పీ తుహిన్‌సిన్హాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు పాల్గొన్నారు. ఇదిలావుటే, ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న రామ్‌కుమార్ శ్రీకాకుళం బదిలీపై వెళ్లారు.

కస్తూర్బా గాంధీ విద్యాలయాలు సత్ఫలితాలు సాధించాలి

▸▸ బాలికల విద్యకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

▸▸ ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు


శిక్షణ శిబిరం సందర్శనకు విచ్చేసిన ఎమ్మెల్సీ గాదె, తదితరులు

సబ్బవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు శతశాతం ఫలితాలు సాధించాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్యే గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. ఇక్కడ దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో రాష్ట్రంలో పలు జిల్లాలకు చెందిన 173 కేజీబీవీల ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవార ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికలకు నాణ్యమైన, గుణాత్మక విద్యన అందించేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం బాలికల విద్యకోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నదని, ఇందుకు అనుగుణంగా సత్ఫ లితాలు సాధించాలని సూచించారు. అనంతరం సీఆర్‌టీలకు అర్హత, సర్వీసు ఆధారంగా పీజీటీలుగా పదోన్నతి కల్పించేలా, మినిమం టైంస్కేల్ వర్తింపజే సేలా కృషి చేయాలని పలువురు సిబ్బంది ఆయనకు వినతి పత్రాలను అందజే శారు. ఈ అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకు వెళ్లి న్యాయం చేసేలా కృషి చేస్తానని వారికి గాదె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 రవీంద్రబాబు, ఉపాధ్యాయులు సత్యంనాయుడు, భాస్కర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు


ఘటనా స్థలంలో నుజ్జయిన కారు ముందుభాగం

కొత్తూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : విశాఖ నుంచి విజయవాడ వెళ్తున్న కారు కొత్తూరు కూడలి సమీ పంలో అదుపు తప్పి డివైడర్‌పై ఉన్న సేఫ్టీ ఊచలను ఢీకొంది. దీంతో కారు ముందు భాగం నుజ్జయ్యింది. శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో ప్రమాదానికి గురైన ఈ కారు విశాఖకు చెందిన సాఫ్ట్ వేర్ ఉద్యోగి సూర్యదేవర సందీప్‌దిగా పోలీసులు గుర్తిం చారు. అయితే ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవ డంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

బీజేపీలో చేరిన పలకా రవి కుటుంబం


రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సమక్షంలో బీజేపీలో చేరిన రవి కుటుంబం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసి ఆ పార్టీకి రాజీనామా చేసిన పలకా రవి తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రాత్రి బీజేపీలోకి చేరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో విశాఖ వెళ్లి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు కలిసి కండువాను కప్పుకున్నారు. పల కాల రవి భార్య యశోధ అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. ఇతని తల్లి వరలక్ష్మి గతంలో కౌన్సిలర్‌గా ఉండేవారు. వీరంతా వైసీపీ రాజీ నామా చేసి బీజేపీలో చేరడంతో కమలనాథులు సాదరంగా ఆహ్వానం పలికారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి పాలన


కరపత్రాన్ని వృద్ధురాలికి అందిస్తున్న టీడీపీ నేత కన్నూరు వెంకటరమణ

పరవాడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత కన్నూరు వెంకటరమణ అన్నారు. మండలంలోని పి.బోనంగి, మడకపాలెంలలో శుక్ర వారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇం టింటికీ వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకు బాసటగా నిలుస్తున్న ప్రభుత్వానికి అంతా సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాయవరపు దేముడు, వర్రి వసంతరావు, గొంతిన శ్రీనివాసరావు, బండారు షణ్ముఖరావు, గంట్ల శ్రీనివాసరావు, మడక లత, బండారు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆందోళన


స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నినాదాలు

కశింకోట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కశింకోటలో శుక్రవారం పలు సంఘాలు ఆందోళన చేపట్టాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి.వరలక్ష్మి మాట్లా డుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అదానీ కంపెనీకి లాభం చేకూర్చేందుకు ఈ స్మార్ట్ మీటర్లను బిగిస్తుం దని ఆరోపించారు. ఇప్పటికే కొన్ని మండలాల్లో అమర్చడం వల్ల విద్యుత్ బిల్లులు భారీగా వస్తుండ డంతో ఆయా వినియోగదారులు గగ్గోలు పెడుతున్నార న్నారు. ప్రజలంతా ఈ మీటర్లను వ్యతిరేకించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అప్పారావు, చిరంజీవి, నూకరాజు, శివ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలపై బార్క్ నిర్వాసితుల ధర్నా

అనకాపల్లి టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రావిపాలెం, దొప్పెర్ల, దోసూరు గ్రామాలకు చెందిన బార్క్ నిర్వాసి తులు శుక్రవారం ఇక్కడి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జిరాయితీ భూములతో సమానంగా డి.పట్టా భూములకు రూ.60 లక్షలు పరిహా రం ఇవ్వాలని, 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఇల్లు కోల్పోయిన వారికి రూ. 25 లక్షలు ప్యాకేజీ అందజేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘాల నాయకుడు కర్రి అప్పారావు, సీపీఎం కన్వీనర్ ఆర్.రాము, నిర్వాసిత నాయకుడు కొల్లి వరహాలు మాట్లాడుతూ 2010లో బార్క్ కోసం చేపట్టిన భూసేకరణలో జిరాయితీ భూములను పలువురు రైతుల వద్ద తీసుకున్నార న్నారు. దీంతో వారు జీవనోపాధి కోల్పోయారని వాపోయారు. తమకున్న కొద్ది భూములతో జీవనం గడుపుతున్న వారి వద్ద నుంచి ఉన్న భూములను అతి త క్కువ రేటుకట్టి బలవంత భూసేకరణ చేస్తున్నారని ఆరోపించారు. ఇళ్లు, భూములు కోల్పోతున్న వారికి నష్టపరిహారం ఇవ్వాలని, భూముల్లో చెట్లు, బోరు బావులు, ఇతర ఆస్తులకు కూడా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కా ర్యక్రమంలో ఎం.నూకరాజు, ఈగల రాజు, తారుమూరు గోపి, మర్రా లోవ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నిర్వాసితులు

నెలల తరబడి వేతనాలివ్వకుంటే ఎలా బతికేదీ?: క్లాప్‌మిత్రలు



మాట్లాడుతున్న పారిశుధ్య కార్మికులు

గూడెంకొత్తవీధి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు (క్లాప్ మిత్రలు) తమకు బకాయి వేతనాలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వారు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ, గ్రామాలు పరిశుభ్రంగా ఉంచేందుకు తాము కష్టపడి పనిచేస్తున్నామన్నారు. అయితే, 13 నెలలుగా వేతనాలు మంజూరు చేయకపోవడం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. మండల పరిషత్ అధికారులకు పలు మార్లు వినతి పత్రాలు అందజేసినా కనీసం పట్టించుకున్న దాఖలాలులేవన్నారు. ప్రభుత్వం స్పందించి బకాయి వేతనాలు విడుదలచేయాలని కార్మికులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సేల్స్‌మన్ కృష్ణారావు సేవలు అభినందనీయం



పదవీ విరమణ చేసిన కృష్ణారావు దంపతులను సన్మానిస్తున్న డీఎం వెంకటేశ్, సహోద్యోగులు

కొయ్యూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థలో సుదీర్ఘకాలం సేల్స్‌మన్‌గా సేవలందించిన చల్లంగి కృష్ణారావు సేవలు అభినందనీయమని చింతపల్లి డివిజనల్ మేనేజర్ బుక్కా వెంకటేశ్ అన్నారు. శుక్రవారం స్థానిక జీసీసీ బ్రాంచి కార్యాలయంలో ప దవీ విరమణ పొందిన సేల్స్‌మెన్ కృష్ణారావు, విజయలక్ష్మి దంపతులను బ్రాంచి ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డివిజనల్ మేనేజర్‌గా మాట్లాడుతూ కృ ష్ణారావు జీసీసీలో 37 ఏళ్ల సేల్స్‌మన్‌గా విధులు నిర్వహించారన్నారు. విధుల పట్ల ఎంతో అంకిత భావంతో పనిచేశారన్నారు. ఉద్యోగంలో ఉత్తమ సేవలందించి అధికారుల మన్ననలు అందుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్లు చల్లంగి సుగునాథం, సరమండ విజయ్, అకౌంటెంట్ గసాడి మల్లేశ్వరరావు, గ్యాస్ సూపరింటెండెంట్ ఎల్. రమణమూర్తి, పీజీటీ టీచర్ మాలిని, పశు వైద్యాధికారి చాలిని, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎంఈవోలుగా పదోన్నతి కల్పించాలి: పీఆర్‌టీయూ



చింతపల్లిలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న పీఆర్‌టీయూ నేత యూవీగిరి, జడ్పీ ఉపాధ్యాయులు

చింతపల్లి, ఆగ స్టు 1 (ఆంధ్ర జ్యోతి): సీనియర్ ఉపాధ్యాయులను ఎంఈవో-1గా నియమించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యూవీ గిరి డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభుత్వ నిర్వాహణలోనున్న స్కూల్ అసిస్టెంట్లకి మాత్రమే ఎంఈవో-1గా నియమించడాన్ని నిరసిస్తూ స్థానిక జడ్పీ స్కూల్ వద్ద ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జూనియర్లకు సైతం ఎంఈవో-1గా పూర్తి అ దనపు బాధ్యతలు అప్పగించడం విచారకరమన్నారు. ఈవిధానంతో పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఈకార్యక్రమంలో పీఆర్‌టీయూ నేతలుఎం. అప్పారావు, గిడ్డి వరలక్ష్మి, వెంకట రమణమ్మ, కిముడు దామోదరం పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలి: గిరిజన సంఘం

పాడేరురూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న అదానీ స్మార్ట్ మీటర్లు గృహాలకు బిగించకుండా ప్రజలు అడ్డుకోవాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాలికి లక్కు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లతో విద్యుత్ వినియోగదారులకు అదనపు భారం పడుతుందన్నారు. విద్యుత్ బిల్లులు గతం కంటే అధికంగా వస్తాయన్నారు ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు చిట్టిబాబు, బొంజన్న పాల్గొన్నారు.



మాడగడలో వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న దొన్నుదొర, నాయకులు



రాజేంద్రపాలెంలో వితంతు పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నేత ప్రసాద్

కూటమి పాలనలో సకాలంలో పింఛన్ల పంపిణీ

- విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ దొన్నుదొర
- నూతనంగా మంజూరైన పింఛన్లు పంపిణీ

అరకులోయ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో సకాలంలో సామాజిక పింఛన్ల మంజూరు చేస్తున్నట్టు విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్, టీడీపీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర పేర్కొన్నారు. మండలంలోని మాడగడ పంచాయితీ కేంద్రంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అధికారులతో కలిసి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీ డీవో లవరాజు, సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు పింఛన్ల సొమ్మును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ రూ. 3వేల పింఛన్ సొమ్మును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెంచారన్నారు. వికలాంగులకు రూ. 6 వేలు, మంచాన పడిన రోగులకు రూ. 10 వే లు అందిస్తున్నారు. మండలంలో నూతనంగా 108 వితంతు పింఛన్లు మంజూరు చేసినట్టు వివరించారు. ఈ పర్యటనలో టీడీపీ మండల అధ్యక్షుడు లకోయ్ మహదేవ్, మార్కెట్ కమిటీ పర్సన్ ఇన్‌చార్జి బొరిబొరి లక్ష్మి, మాజీ వైస్ఎంపీప అమ్మన్న, నాయకులు కూన రమేశ్, శెట్టి రాజు, కొర్ర శేఖర్, వంతల వెంకట్రావు, బొరిబొరి పోతురాజు, సమర్ది రామచందర్ వెంకటరావు, బాలరాజు, బుద్దు కాశీరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, పెదలబుడు పంచాయతీ పరిధిలో నూతనంగా మంజూరైన 16 పింఛన్లను లబ్ధిదారులు అందించినట్టు సర్పంచ్ దాసుబాబు తెలిపారు.

డుంబ్రిగుడ: మండలంలో వృద్ధులు, దివ్యాంగులు, వికలాంగులు, వితంతువులకు సచివాలయ ఉద్యోగులు, కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ అధ్యక్షుడు సుబ్బారావు, గ్రామ కమీటీ అధ్యక్షులు త్రినాధ రావు, బొంజుబాబు, సింహాద్రిపాల్గొన్నారు.

చింతపల్లిలో 127 కొత్త పింఛన్లు మంజూరు

చింతపల్లి: మండలంలో 127 మంది వింతతువులకు కొత్త పింఛన్లు మంజూరైనట్టు స్థానిక ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక మేజర్ పంచాయతీ కేంద్రంలోనూతన పింఛన్లను ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులతో కలిసి ఎంపీడీవో లబ్ధిదారులకు అందజేశారు. తొలి రోజే మండలంలో పింఛన్ల పంపిణీ 97 శాతం పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దురియా పుష్పలత, కూటమి నాయకులు రీమల ఆనందరావు, నాగభూషణం, దూరి రామకృష్ణ, ఏఎంసీ డైరెకర్ చిన్న, జనసేన మండలాధ్యక్షుడు వంతల బుజ్జిబాబు పాల్గొన్నారు.

కొయ్యూరులో 116 పింఛన్లు..

కొయ్యూరు: వితంతువులకు పింఛన్లను సత్వరం అందించి వారిని ఆదుకునేలా చర్యలు చేపట్టిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎంవీవీ ప్రసాద్, మండల అధ్యక్ష, కార్యదర్శులు కాకురు చంద్రరావు, తోట దొరబాబు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలో గత నెలలో చనిపోయిన 116 మందికు సంబంధించిన భార్యలకు మంజూరైన పింఛన్లను రాజేంద్రపాలెం, కొయ్యూరు, నల్లగొండ తదితర గ్రామాల్లో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 7407 మంది వివిధ పింఛన్లు పొందుతున్నారని, కొత్తగా మంజూరైన వాటితో ఈ సంఖ్య 7,523 మందికి చేరిందన్నారు. సర్పంచ్‌లు, కూటమి నేతలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి మండలంలో 13,922 మందికి అన్నదాత సుఖీభవ మంజూరు

చింతపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో 13,922 మంది రైతుల బ్యాంక్ ఖాతాల్లో అన్నదాత సుఖీభవ నగదును శనివారం ప్రభుత్వం జమచేయనున్నట్టు స్థానిక వ్యవసాయ అధికారి మధుసూదనరావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 13,922 మంది రైతులకు రూ. 7 వేల చొప్పున 97,45,4000 నగదు జమ చేయనున్నట్టు చెప్పారు.

జీకేవీధిలో 13,301మందికి..

గూడెంకొత్తవీధి: మండలంలో 13,301మంది రైతులకు రూ.93,107,000 అన్నదాత సుఖీభవ నగదు జమ చేయనున్నట్టు ఇన్‌చార్జి ఏవో మధుసూదనరావు తెలిపారు.

కొయ్యూరులో 9,664మందికి..

కొయ్యూరు: మండలంలో 9,664మంది రైతులకు అన్నదాత సుఖీభవ నగదు జమ చేయనున్నట్టు స్థానిక ఏవో ప్రియాంక తెలిపారు. ఈకేవైసీ పూర్తయిన 9,664మంది రైతులందరికి రూ.67,64,8000 మంజూరైనట్టు చెప్పారు.

వైభవంగా వరలక్ష్మీ సామూహిక వ్రతాలు



రాజరాజేశ్వరి ఆలయంలో జరిగిన వ్రతంలో పాల్గొన్న మహిళలు

పాడేరురూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉమానీలకంఠేశ్వరస్వామి వారి రాజరాజేశ్వరి ఆలయంలో శ్రావణ శుక్రవారాన్ని పురష్కరించుకుని సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు.అర్చకులు ఉప్పల రామం పంతులు అమ్మవారికి ప్రత్యేక పూజలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు యూవీ రత్నం, కొట్టగుళ్లి రామారావు, కొమ్మోజీ వెంకటరమణ, సిద్ధినాతి కొండలరావు, కిముడు ప్రభాకరరావు, రాజుబాబు, బాబూరావు, ఆధ్యాత్మిక సేవా బృంద ప్రతినిధులు శివ, నాగు, మూర్తి, గౌరీ, సంతోష్, పాల్గొన్నారు.

'కూటమి' చేస్తున్న అభివృద్ధిపై వైసీపీ దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటు': టీడీపీ



విలేకరుల సమావేశంలో టీడీపీ మండలాధ్యక్షుడు పూర్ణచంద్రరావు, నేతలు

చింతపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూపి వైసీపీ నాయకులు తామే ఇదంతా చేస్తున్నట్టు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని స్థానిక టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు విమర్శించారు. శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అంజలి శనివారం పంచాయతీకి రహదారిని ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. స్థానిక గిరిజనులు వినతులిచ్చినా పట్టించుకోలేదన్నారు. కూటమి ప్ర భుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అంజలి శనివారం పంచాయతీకి నిధులు కేటాయించి కేవలం పది రోజుల్లో తారు రోడ్డు నిర్మిస్తే వైసీపీ నాయకులు పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు కృషి ఫలితంగా రహదారి అందుబాటులోకి వచ్చిందంటూ ప్రచారం చేసుకోవడం ఆ పార్టీ నాయకుల దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. వైసీపీ నాయకుల చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రీమల ఆనందరావు, సోమేశ్, అర్జున్, కంఠంనాయుడు, గాంధీ పడాల్, అంద్రాబు లక్ష్మణ్, మహేంద్ర, పౌలు, మంగ్లు, వల్లి, నారాయణరావు, పరమేశ్వరరావు, జనసేన మండలాధ్యక్షుడు బుజ్జిబాబు పాల్గొన్నారు.

16, 17 తేదీల్లో సీపీఐ మహాసభలు

కొయ్యూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రంప చోడవరంలో జరిగే సీపీఐ రెండో జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలో అంతాడ పంచాయతీ మునసల గ్రామంలో ఈ నెల 16, 17 తేదీలలో రంపచోడవరంలో నిర్వహించనున్నమహాసభల పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాన్ని జిల్లాగా ఏర్పాటు చేసిన ప్రభుత్వాలు ఈ ప్రాంత అభివృద్ధి, మౌలిక వసతుల కల్పించడంలో విఫలమైందన్నారు. గిరిజనుల హక్కుల పరిరక్షణకు జిల్లా మహాసభల్లో రూపకల్పన జరుగుతుందన్నారు.కార్యక్రమంలో జిల్లా నాయకులు ఉల్లి సత్యనారాయణ, ఇరవాడ దేము డు, మండల కార్యదర్శి సూరిబాబు, నానాజీ, ఎంవీవీ సత్యనారాయణ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య ద్వారా డిగ్రీ, పీజీ అడ్మిషన్లు ప్రారంభం

పాడేరురూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎ డ్యుకేషన్ ద్వారా 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ అడ్మిషన్లు ప్రారంభమైనట్టు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టబ్బాయి తెలిపారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూపులతోపాటు పీజీలో ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంసీఏ, ఎంబీఏ గ్రూపుల్లో ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. విద్యార్థులు సెప్టెంబరు 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలను కళాశాల దూర విద్య కేంద్రంలో నేరుగా లేదా ఫోన్: 9441415881ను సంప్రదించాలని తెలిపారు.

తల్లి పాలతో పిల్లలకు మెరుగైన రోగ నిరోధక శక్తి



బాలింతలతో స్త్రీ వైద్యనిపుణులు వాసవి, వైద్యులు

చింతపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలు శిశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెంచుతుందని స్థానిక ఏరియా ఆస్పత్రి స్త్రీ వైద్యనిపుణులు ఎస్. వాసవి అన్నారు. శుక్రవారం ఏరియా ఆస్పత్రిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. బాలింతలతో ఆమె మాట్లాడుతూ ప్రతి తల్లి ఆరు నెలల పాటు శిశువులకు పాలుఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఇందిరా ప్రియాంక,లావణ్య, నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి పాల్గొన్నారు.

'గిరిజన చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలి'

డుంబ్రిగుడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన హక్కుల చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం అడపవలప గ్రామంలో ప్రపంచ ఆదివాసీ వారోత్సవాలను జయప్రదంగా చేయాలని కోరుతూ జెండాను అవిష్కరించారు. గిరిజన ప్రాంతంలో ఉపాధ్యాయుల నియమకానికి ప్రత్యేక డీఎస్సీను భర్తీ చేయాలన్నారు. ఆదివాసీ హక్కులను కాపాడాలని ఆయన కోరారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

కొమ్ములవాడలో పాఠశాల తెరవాలని ఆందోళన



ఉపాధ్యాయులను నియమించాలని నిరసన వ్యక్తంచేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

సీలేరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ కొమ్ములవాడ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు లేక వేసవి సెలవుల తరువాత నేటి వరకు తెరచుకోలేదు. ఇప్పటికి 50 రోజులుగా మూతపడే ఉంది. దీంతో శుక్రవారం తమ ఉపాధ్యాయులను నియమించాలంటూ ఆ పాఠశాల ఎదుట విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్థులతో కలిసి ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 40 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గత ఏడాది ఈ పిల్లల విద్యా బోధనకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉం డే వారు. ఈ ఏడాది ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో ఈ ఇద్దరు ఉపాధ్యాయులు వేరేచోట్లకు వెళ్లిపోయారు. ఈ పాఠశాలకు కొత్తగా ఉపాధ్యాయులను ఎవరినీ నియమించడకపోవడంతో వేసవి సెలవులు అ నంతరం పాఠశాల తెరచుకోకపోవడంతో తమ పిల్లలు విద్యకు దూరమైపోతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వెగుగూరి రామారావు, వెలుగూరి సుందరమ్మ మాట్లాడుతూ ఇక్కడ పనిచేసిన ఇద్దరు ఉపాధ్యాయుల్లో కనీసం ఒక్కరినైనా నియమించి పాఠశాలను తెరిపించాలని డిమాండ్ చేశారు.

గిరిజన సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



పాడేరులో పర్యటిస్తున్న గిడ్డి ఈశ్వరి, నాయకులు

పాడేరురూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే గిరిజనాభివృద్ధి సాధ్యమని టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె పాడేరులో నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం గత ఏడాది పాలనలో అందించిన పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల సంక్షేమానికి చంద్రబాబు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎన్నికల హామీలలో భాగంగా శనివారం పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధులను రైతుల ఖాతాల్లో జమచేయనున్నారని, 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ, నాయకులు రొబ్బి రాజాదీప్ కుమార్, వరలక్ష్మి, కొట్టగుళ్లి రమేశ్‌నాయుడు, రొబ్బి రాము, ఎంపీటీసీ సభ్యురాలు ఉషా రాణి, రాంబాబు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ పోస్టులన్నీ గిరిజన అభ్యర్థులకే చెందాలి'



చింతపల్లిలో ర్యాలీ చేపడుతున్న గిరిజన సంఘం నాయకులు, నిరుద్యోగులు

చింతపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): షెడ్యుల్డ్ ప్రాంతాల్లో ఉపాధ్యాయ పోస్టులన్నీ శతశాతం ఆదివాసీ నిరుద్యోగ యువతతోనే భర్తీ చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ ప్రకటన విడుదల చేయాలని కోరుతూ జీపుజాతను ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ ఈనెల 8తేదీ వరకు జీపు జాత నిర్వహిస్తామన్నారు. జీవో నంబరు-3 రద్దుకావడంతో ఆదివాసీ యువత మెగా డీఎస్సీలో తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధర్మాన్నపడాల్, కృష్ణ, కూడరాధ, భాను, సత్యనారాయణ, విష్ణుమూర్తి, రాజు, మాధవరావు, గిరిజన సంఘం గౌరవ అధ్యక్షుడుచిన్నయ్యపడాల్, నాయకులు పాంగి ధనుంజయ్, సాగిన చిరంజీవి, సీపీఐ నేత పేట్ల పోతురాజు పాల్గొన్నారు.

లోతుగెడ్డ-రాళ్లగెడ్డ రహదారి నిర్మించాలి: వైసీపీ

చింతపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): లోతుగెడ్డ- రాళ్లగెడ్డ రహదారి నిర్మించాలని వైసీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి కోరారు. శుక్రవారం ఆమె స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యతో కలిసి లోతుగెడ్డ-రాళ్లగెడ్డ రహదారిని పరిశీలించారు. వంగసార ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలుఅడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులు పూర్తిగా పాడైపోయాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి లోతుగెడ్డ-రాళ్లగెడ్డ రహదారి నిర్మించాలని, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాగిన వెంగళరావు, బలపం సర్పంచ్ రమేశ్ నాయుడు పాల్గొన్నారు.

ట్యాబ్‌లు లేక అంగన్‌వాడీల అవస్థలు

కొయ్యూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభుత్వ యాప్‌లలో సమాచారం పొందుపరిచేందుకు వీలుగా గతంలో ఇచ్చిన సెల్‌ఫోన్ల స్థానంలో ట్యాబ్‌లను సరఫరా చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక గిరిజన భవన్‌లో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యదర్శి అచ్చియ్యమ్మ ఆధ్వర్యంలో సభ్యుల సమావేశం నిర్వహించింది. ముఖ్యఅతిథిగా చిన్నపడాల్ మాట్లాడారు. అంగన్‌వాడీల వేతనాలను రూ. 26 వేలకు పెంచాలని, మినీ అంగన్‌వాడీలను మొయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ జీవో ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి అప్పలనాయుడు, నేతలు సూరిబాబు, బొంజుబాబు, అంగన్‌వాడీ యూనియన్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పనితీరుపై అసంతృప్తి

- రైతుల వివరాలు నమోదుకాక అందని వ్యవసాయ పరికరాలు
- పర్యవేక్షణ లేక విద్యా ప్రమాణాలు దిగజారుతున్నాయి
- మండల సమావేశంలో సర్పంచులు ధ్వజం



మాట్లాడుతున్న ఎంపీపీ రత్నకుమారి

పాడేరు రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విద్య, వ్యవసాయ, పశు సంవర్థక తదితర శాఖల అధికారుల పనితీరుపై ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్య క్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎస్. రత్నకుమారి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖాధికారులు రాయితీపై పవర్ టిల్లర్లు, ఇతర పరికరాలను అందించకపోవడంతో రైతులు మార్కెట్‌లో కొనుగోలు చేసుకోవాల్సి వస్తోందని డి.గొందూరు పంచాయతీ సర్పంచ్ సీదరి రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. కాడెల సర్పంచ్ బసవన్న, మినుములూరు సర్పంచ్ లంకెల చిట్టమ్మ తదితరులు మాట్లాడుతూ సచివాలయాల్లో రైతుల వివరాలను వ్యవసాయ సిబ్బంది సేకరించడంలో విఫలం కావడంతోనే రాయితీ పరికరాలు వారికి అందడంలేదన్నారు. అలాగే, విద్యాశాఖాధికారులు పర్యవేక్షణ లోపంతో గ్రామాల్లో ప్రాథమిక విద్య పూర్తిగా కుంటుపడినట్టు ఆరోపించారు. కొన్ని పాఠశాలల్లో 6వ తరగతి చదివే విద్యార్థులు వర్ణమాల రాయలేని దుస్థితి ఉన్నారని పలువురు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రాథమిక విద్యను పటిష్ఠంగా అమలు చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు ఎంఈవో సీహెచ్.సరస్వతీదేవికి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆమె మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధిపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఇప్పటికే 3, 4, 5 తరగతులు విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషు, లెక్కల సబ్జెక్టులపై ఇప్పటికే బేస్ పరీక్షలను నిర్వహించినట్టు వివరించారు. ప్రజాప్రతినిధులు పాఠశాలలకు వెళ్లి విద్యా ప్రమాణాలపై పరిశీలించాలని సూచించారు. పశువైద్య సిబ్బంది సకాలంలో వైద్య సేవలందించడంలేదని సర్పంచ్‌లు ఆరోపించారు. పశువులు మృతి చెందిన తరువాత గ్రామాలను సందర్శించి వ్యాధి నిరోధక టీకాలు వేయడంతో ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నించారు. ఎంపీపీ ఎస్. రత్నకుమారి మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలన్నారు. గిరిజన సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలను అర్హులకు చేరువ చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జె.తేజరతన్, ఏవో పీఆర్ సీ.వేణుగోపాల్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వంతెనలు లేక గిరిపుత్రుల అగచాట్లు



బియ్యంమూటతో గెడ్డ దాటుతున్న హరిపురం అంగన్‌వాడీ కార్యకర్త

సీలేరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలంలో మారుమూల గ్రామాలకు వంతెనలు లేక వర్షాకాలంలో గిరిజనులు ప్రాణాలకు తెగించి గెడ్డలను దాటాల్సి వస్తోంది. శుక్రవారం దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని హరిపురానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త బియ్యం మూటను తలపై పెట్టుకుని దుప్పులవాడ- హరిపురం మధ్య గల వాగును దాటి వెళ్లారు. ఈ సందర్భంగా గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు అంపురంగి బుజ్జిబాబు మాట్లాడుతూ, హరిపురం నేరేడుపల్లి, రాళ్ళగెడ్డ రాంపురం తదితర గ్రామాల ప్రజలు పంచాయతీ కేంద్రానికి రావాలంటే ఈ వర్షాకాలంలో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ గ్రా మాల ప్రజలు దుప్పులవాడ రావాలంటే ధారకొండ, అగ్ర హారం, కుమ్మరాపల్లి, మీదుగా 15 కిలో మీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని ఈ సందర్భంగా ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.

వైద్య సిబ్బంది సాహసం



రైవాడ జలాశయంలో పడవపై వెళుతున్న వైద్య సిబ్బంది

అనంతగిరి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పినకోట పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రామకృష్ణ శుక్రవారం మలేరియా సిబ్బందితో కలిసి రైవాడ జలాశయంపై నాటు పడవలో ప్రయాణించి గ్రామాల్లో దోమలనివారణ మందు పిచికారీ చేయించారు. వివరాలివి.. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం బొడ్డపాడు వరకు బైక్‌పై బృందంతో వెళ్లి, అక్కడ నుంచి రైవాడ జలాశయంపై నాటు పడవలో కొంతదూరం ప్రయాణించి, పినకోట పంచాయతీ సొలబొంగు, కొత్తబూరగలకు చేరుకున్నారు. రెండు గ్రామాల్లో దోమల నివారణ స్ప్రే చేయించారు. మలేరియాపై గిరిజనులకు అవగాహన కల్పించారు.

పశువులకు నులిపురుగు నివారణ టీకాలు



కొత్తసుజనకోటలో టీకాలు వేస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పశువులకు విధిగా రైతులు నులిపురుగుల నివారణ టీకా లు వేయించాలని పశుసంవర్థక శాఖ ఏడీ రాజారవికుమార్ అన్నారు. మండలంలోని సుజనకోట పంచాయతీ కొత్త సుజనకోటలో శుక్రవారం డీవార్మింగ్, వ్యాక్సిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 42 పశువులకు, 54 మేక లు, గొర్రెలకు వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్థక సిబ్బంది యమున ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

గత పాలకులు రాష్ట్రాన్ని దివాలా తీయించారు

▸▸ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

నాతవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గత పాలకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దివాలా తీయించారని, నేడు సీఎం చంద్రబాబు గాడిలో పెడుతున్నారని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. మండలంలోని గునుపూడిలో శుక్రవారం పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా లక్షా ఎనిమిది వేల స్పౌజ్ పించన్లు మంజూరు చేశారన్నారు. రైతుల పెట్టుబడి కోసం ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ మొత్తం రైతుల ఖాతాలో చేస్తున్నట్టు చెప్పారు. ఈ ఏడాదిలో తాండవ అభివృద్ధికి రూ.8 కోట్లు ఇచ్చామన్నారు. ఆగస్టు రెండో వారంలో తాండవ నీరు ఖరీఫ్‌నకు విడుదల చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం గునుపూడి హైస్కూల్‌ను అయ్యన్నపాత్రుడు సందర్శించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో ఉషశ్రీ, మండల పరిషత్ పరిపాలనాధికారి వి.పార్థసారథి, తాండవ ఛైర్మన్ కరక సత్యనారాయణ, నియోజకవర్గ జనసేన నాయకుడు రాజాన వీర సూర్యచంద్ర, టీడీపీ నేత నందిపల్లి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో రూ.6.55 కోట్లతో 20.08 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధి

▸▸ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రూ.6.55 కోట్లతో 20.08 కిలోమీటర్ల వరకు రహదారులు అభివృద్ధి చేస్తున్నామని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. శనివారం ఆయన మాట్లాడుతూ నర్సీపట్నం, గొలుగొండ, నాతవరం, మాకవరపాలెం మండలాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. పనులకు టెండర్ ప్రక్రియ పూర్తి చేసినట్టు చెప్పారు. నర్సీపట్నం-కాకరపాడు రోడ్డు నుంచి అమ్మపేట వరకు విస్తరించడానికి రూ.50 లక్షలు, వీకేగూడెం నుంచి లక్ష్మీపురం 1.6 కిలోమీటర్లు రోడ్డుకు రూ.50 లక్షలు, చోద్యం నుంచి విప్పలపాలెం మీదుగా గాదంపాలెం రహదారికి రూ.60 లక్షలు, జోగింపేట నుంచి సాలిక మల్లవరం రోడ్డుకు రూ.75 లక్షలు, పాతమల్లంపేట నుంచి కొత్తపాలెం మూడు కిలోమీటర్లు రోడ్డుకు రూ.90 లక్షలు, కురవాడ నుంచి మాదవనగరం మూడు కిలోమీటర్ల రోడ్డుకు రూ.1.35 కోట్లు, తాళ్లపాలెం ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి జెడ్.గంగవరం 1.6 కిలోమీటరు రోడ్డుకు రూ.45 లక్షలు, వేములపూడి నుంచి పెద ఉప్పరగూడెం 1.3 కిలోమీటర్లు రోడ్డు రూ.60 లక్షలు, కృష్ణాపురం నుంచి వేములపూడి 3.68 కిలోమీటర్ల రోడ్డుకు రూ.90 లక్షలు నిధులు మంజూరయ్యాయని ఆయన వివరించారు.

కానిస్టేబుల్ ఉద్యోగ ఫలితాల్లో గ్రామీణ యువకుల సత్తా

చోడవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన కానిస్టేబుల్ ఫలితాల్లో గ్రామీణ యువకులు సత్తా చాటారు. పలువురు యువకులు ఈ ఉద్యోగాలకు అర్హత సాధించారు. చోడవరం యువకుడు నేమాల చంద్రశేఖర్ 2143 మార్కులు సాధించి సివిల్ కానిస్టేబుల్ పోస్టుకు ఎంపికయ్యాడు. నిరుపేద కుటుంబానికి చెందిన చంద్రశేఖర్ ఎంబీఏ చదివి ప్రభుత్వ కొలువు సాధించాలన్న పట్టుదలతో కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌కు హాజరై కొలువు పట్టాడు. ప్రభుత్వ అధికారిగా పని చేయాలన్నది తన లక్ష్యమని ఈ సందర్భంగా చంద్రశేఖర్ తెలిపారు.



కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన చోడవరం యువకుడు చంద్రశేఖర్

సివిల్ కానిస్టేబుల్‌గా అర్జాపురం యువకుడు...

రావికమతం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.అర్జాపురం గ్రామానికి చెందిన గాలి రమేశ్ సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. శుక్రవారం విడుదల చేసిన కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల్లో సత్తా చాటి సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగానికి అర్హత సాధించాడు. నిరుపేద రైతు కుటుంబానికి చెందినరమేశ్ తన అమ్మమ్మ సహకారంతో ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నాడు. కోచింగ్‌కు కాకినాడు వెళ్లి కానిస్టేబుల్ పోటీ పరీక్షల కోసం శిక్షణ పొందాడు. సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగానికి అర్హత పొంది తాను అనుకున్న లక్ష్యం సాధించాడు. దీంతో రమేశ్‌ను తల్లిదండ్రులు, కుటుంబీకులు, గ్రామస్థులు అభినందించారు.



గాలి రమేశ్

తారువ విద్యార్థి ప్రతిభ

దేవరాపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన కానిస్టేబుల్ ఫలితాల్లో మండలంలోని తారువకు చెందిన రాయపురెడ్డి అన్వేష్ ఉద్యోగం సాధించాడు. విశాఖ గ్రామీణ విభాగంలో అన్వేష్‌కు 147 మార్కులు వచ్చాయి. సామాన్య రైతు కుటుంబానికి చెందిన అన్వేష్ ఆంధ్ర విశ్వ విద్యాయంలో ఎంఎస్సీ పూర్తి చేశాడు. విజయనగరం జిల్లా ఎస్.కోటలో తన బంధువుల ఇంటి వద్ద ఉంటూ ప్రతి రోజూ గ్రంథలయానికి వెళ్లి కానిస్టేబుల్ పరీక్షకు సిద్ధమయ్యేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు అన్వేష్‌ను కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అభినందించారు.



రాయపురెడ్డి అన్వేష్

సివిల్ కానిస్టేబుల్‌గా వడ్డాది యువకుడి ఎంపిక

బుచ్చెయ్యపేట, జూలై 31 (ఆంధ్ర జ్యోతి) మండలంలోని మేజర్ పంచాయతీ వడ్డాదికి చెందిన మెహన్ సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన మోహన్ తన సోదరులను స్ఫూర్తిగా తీసుకుని కానిస్టేబుల్ పరీక్షకు సన్నద్ధమయ్యాడు. ఇప్పటికే ఇద్దరు సోదరులు కానిస్టేబుళ్లుగా ఉద్యోగాలు చేస్తుండడంతో, వారి స్ఫూర్తితో చదువుకుని తాను కూడా అనుకున్న లక్ష్యాన్ని సాధించానని ఈ సందర్భంగా మోహన్ ఆనందం వ్యక్తం చేశాడు. కాగా, మోహన్‌ను గ్రామస్థులు అభినందించారు.

ఏఎల్‌పురంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు దగ్ధం

కృష్ణాదేవిపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం ఏఎల్‌పురంలో బస్ స్టేషన్ వెనుక ఉన్న పైల సూరిబాబు ఇంట్లో రెండు విద్యుత్ స్మార్ట్ మీటర్లు గురువారం అర్ధరాత్రి సమయంలో కాలి పోయాయి. దీంతో గత నెలలో వేసిన ఈ స్మార్ట్ మీటర్లు ఏమైందో తెలియదు కానీ పెద్దగా శబ్దం వచ్చి మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో నిద్రిస్తున్న కుటుంబ సభ్యులు భయాందోళనతో రోడ్డుపైకి పరుగుతీశారు. స్మార్ట్ మీర్టుల బిగించిన తర్వాతే ఈ విధంగా జరిగిందని, తన జీవనాధారమైన ఎలక్ట్రీషన్ సామాన్లు ప్రమాదంలో దగ్ధమయ్యాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనపై అధికారులు దర్యాప్తు చేసి తగిన పరిహారంతో పాటు కొత్తవిద్యుత్ మీటర్లు వేసి న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



దగ్ధమైన రెండు స్మార్ట్ మీటర్లు

ఉత్సాహంగా సామాజిక పింఛన్ల పంపిణీ

వితంతువులకు కొత్త పింఛన్లు అందించిన కూటమి నేతలు

నర్సీపట్నం/గొలుగొండ/కృష్ణాదేవిపేట/మాకవరపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీ ప్రక్రియ శుక్రవారం ఉత్సాహంగా సాగింది. ఈ నెల కొంత మందికి కొత్త పింఛన్లు మంజూరు కావడంతో వారిలో ఆనందం రెట్టింపైంది. నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలోని అన్ని మండలాల్లో కూటమి నాయకుల చేతుల మీదుగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. నర్సీపట్నం మునిసిపాలిటీ పరిధిలోని 26వ వార్డులో కౌన్సిలర్ చింతకాయల పద్మావతి పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం వార్డులో లబ్ధిదారులకు గడప గడపకు వెళ్లి పింఛను సొమ్ము అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. గొలుగొండ మండలంలో 161 నూతన పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీవో మేరీరోజీ తెలిపారు. గుండుపాల, గొలుగొండ, పాకలపాడు, రావణాపల్లి, కొత్తఎల్లవరం, కె.మల్లంపేట, పాతమల్లంపేట గ్రామాల్లో వితంతువులకు స్థానిక నాయకుల చేతులుమీదుగా పింఛన్లు అందించారు. కార్యక్రమంలో నాయకులు కామిరెడ్డి గోవింద్, మంజూరు చేసిందన్నారు. ఏఎల్‌పురం, కృష్ణాదేవిపేట, కొంగసింగి తదితర గ్రామాల్లో జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్ పింఛన్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భర్త చనిపోతే భార్యకు మరుసటి నెల పెన్షన్ అందించడం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని కొనియాడారు. గొలుగొండ మండలంలో 161 మందికి నూతన పింఛన్లు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొడ్డు జమీలు, పెట్ల నారాయణమూర్తి, అప్పలనాయుడు, పాపారావు, లగుడు రమేశ్, రాజులునాయుడు, మ్యల బుజ్జి పాల్గొన్నారు. మాకవరపాలెంమండలంలో నూతనంగా మంజూరైన పింఛన్లను ఎంపీడీవో మేరీ జోన్స్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, నాయకులు పంపిణీ చేశారు. కొత్తగా 18 వితంతు పింఛన్లు మంజూరయ్యాయి. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లాలం రాము, టీడీపీ నాయకులు రమణ, నాని, శర్మ పాల్గొన్నారు.



నర్సీపట్నంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ పద్మావతి

చోడవరం నియోజకవర్గంలో...

చోడవరం/రావికమతం/బుచ్చెయ్యపేట/రోలుగుంట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. చోడవరం నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల్లో శుక్రవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అర్హులకు పింఛన్లు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, ఎంపీపీ గాడి కాసు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, సర్పంచులు మొల్లి ఈశ్వరరావు, సియ్యాద్రి జగదీశ్, సేనాపతి శ్రీను జడ్పీటీసీ మాజీ సభ్యుడు కనిశెట్టి మత్స్యరాజు, స్థానిక నేత కొట్యాపు చిన్న పాల్గొన్నారు. రావికమతం మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ మండలానికి కొత్తగా 227 వితంతు పింఛన్లు మంజూరయ్యాయని చెప్పారు. ఎంత ఆర్థిక భారమైనప్పటికీ ఇచ్చిన మాట తప్పకుండా సుపర్‌సిక్స్ పథకాలు ఆమలు చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకే దక్కుతుందన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం ఆమలుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కోమటి శంకరావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి, ఉప సర్పంచ్ జి.మోదునాయుడు, ఇన్‌చార్జి ఎంపీడీవో సీతారామస్వామి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రోలుగుంట మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ ఇంటి దిక్కును కోల్పోయి వితంతువులకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం కన్నా అధికంగా పింఛన్ల మంజూరు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రోలుగుంట మండలంలోని 276 స్పౌజ్ పింఛన్లు మంజూరైనట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగమ్మ, ఎంపీడీవో నాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పంచాడ చంద్ర, నాయకులు సుర్ల రామకృష్ణ, రొంగలి వెంకటరమణ, పోతల శ్రీనివాసరావు, బి.చిరంజీవి, కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట మండలంలో 196 నూతన పింఛన్లను ఎమ్మెల్యే రాజు పంపిణీ చేశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ డి.నాగేశ్వరిదేవి, ఎంపీడీవో బానోజీరావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదల సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు ఎంవీవీ.సత్యనారాయణ, నాయకులు జి.కోటేశ్వరరావు, వి.అప్పారావు, డి.కిశోర్, డి.అప్పలనాయుడు, దేవర అప్పారావు, వడ్డాది నేతలు దొండా నరేశ్, గిరిబాబు పాల్గొన్నారు.



చోడవరంలో లబ్ధిదారులకు పింఛను అందచేస్తున్న ఎమ్మెల్యే రాజు

మాడుగుల నియోజకవర్గంలో...

మాడుగుల/చీడికాడ/దేవరాపల్లి/కె.కోటపాడు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదలకు పింఛన్ పథకం ప్రవేశపెట్టిన ఘనత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావుకే దక్కుతుందని, దాన్ని భారీ స్థాయిలో రూ.4 వేలకు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుదేనని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మాడుగుల నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల్లో కొత్తగా మంజూరైన వితంతు పింఛన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. చీడికాడ మండలంలోని తురువోలు గ్రామంలో శుక్రవారం జేబీ.పురం, చీడికాడ, చుక్కపల్లి, అర్జునగిరి, తురువోలు గ్రామాల్లో ఎమ్మెల్యే చేతుల మీదుగా వీటిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాడుగుల నియోజకవర్గానికి 691 పింఛన్లు మంజూరుకాగా, చీడికాడ మండలానికి 133 వచ్చాయన్నారు. భవిష్యత్తులో మిగతా వితంతువులకు పింఛన్‌లు అందించడానికి చంద్రబాబు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి.హేమసుందర్రావు, పంచాయతీ కార్యదర్శులు ఎ.సన్యాసిరావు, సుభాశ్, మాజీ ఎంపీపీ పాత్రిన సింహాచలంనాయుడు, నాయకులు బీళ్ల కోటేశ్వరరావు, పిటి.బాబు పాల్గొన్నారు. కె.కోటపాడు మండలం 32 పంచాయతీల్లోని గ్రామాల్లో కూటమి నాయకులు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు.మేడిచర్ల గ్రామంలో ఎంపీడీవో సాంబశివరావు పెన్షన్ అందించారు. మండలానికి కొత్తగా 209 పింఛన్లు మంజూరయ్యాయని ఈ సందర్భంగా ఎంపీడీవో తెలిపారు. దేవరాపల్లి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ కిలపర్తి బాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, సర్పంచ్ పెంటమ్మ, నాయకులు గుల్లిపల్లి అర్జున పింఛన్లు అందించారు. ఎ.కొత్తపల్లిలో టీడీపీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, నాయకులు రామకృష్ణ, రాజినాయుడు పాల్గొన్నారు.



చీడికాడ మండలంలోని వరహాపురం పింఛన్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

అన్నదాతలకు రూ.35.51 కోట్ల నిధులు

▸▸ చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

▸▸ నేడు రావికమతంలో పథకం ప్రారంభోత్సవ సభ

రావికమతం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): చోడవరం నియోజకవర్గం పరిధిలోని 50,733 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకానికి రూ.36.51 కోట్లు విడుదలయ్యాయని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు ఆయన తెలిపారు. మండల కేంద్రంలో శనివారం జరగనున్న అన్నదాత సుఖీభవ సభా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఈ మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.2 కలిపి నేరుగా రైతుల ఖాతాలకే ప్రభుత్వం వేస్తోందన్నారు. మరో విడతలో కలిపి మొత్తం రూ.20 వేలు అన్నదాత సుఖీభవ పథకంగా రైతులకు అందజేయాలని ప్రభుత్వ లక్ష్యమని ఆయన వివరించారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలను అధికారులు, కూటమి నాయకులు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కెఎస్ఎన్ రాజు

దేవరాపల్లిలో ఏర్పాట్లు పరిశీలన

దేవరాపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం నియోజకవర్గ స్థాయి అన్నదాత సుఖీభవ కార్యక్రమం ప్రారంభోత్సవ సభ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లను కూటమి నాయకులు పరిశీలన చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ మాట్లాడుతూ ఈ సభలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయ ఛైర్మన్ పాత్రునాయుడు, మండల వ్యవసాయ అధికారి కాంతమ్మ, జలాశయ డీఈఈ సత్యంనాయుడు, ఏపీఎం ప్రభాకర్ పాల్గొన్నారు.

వేలాది జీవితాల్లో వెలుగు నింపేది ఉపాధ్యాయులే

▸▸ మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

మాడుగుల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వేలాది జీవితాల్లో వెలుగు నింపగలిగడం ఉపాధ్యాయులకే సాధ్యమని మాడుగుల శాసనసభ్యుడు బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. మండలంలోని తాటిపర్తి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న చలుగు జగన్నాథం పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాల హెచ్ఎం రమాదేవి అధ్యక్షతన జరిగిన సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ జగన్నాథం మాస్టారు కుటుంబం కోనాం రిజర్వాయర్ నిర్మాణానికి భూమి విరాలంగా అందించి అన్నధాతకు అండగా నిలిచినట్టు చెప్పారు. తన ఉద్యోగ ప్రమాణంలో అందరితో కలసిమెలసి పనిచేసినందునే పదవీవిరమణకు ఇంతమంది ఉద్యోగులు వచ్చారన్నారు. అనంతరం జగన్నాథం, దుర్గాకుమారి దంపతులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పాడేరు మాజీ ఎమ్మెల్యేలు గిడ్డి ఈశ్వరి, కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ 39 ఏళ్లగా ఉపాధ్యా వృత్తిలో విద్యార్థులను తన పిల్లలుగా చూసుకొని నేడు పదవీ విరమణ పొందడం ఎంతో అభినందనీయమన్నారు. పదవీ విరమణ అనంతరం ఆయన ఆనందంగా గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం, అరకు జడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోషిని, మాడుగుల మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

అందివచ్చిన కొడుకు అనంత లోకాలకు..

అనకాపల్లి రోడ్డు ప్రమాదంలో గొలుగొండ యువకుడి మృతితో శోకసంద్రంలో కుటుంబీకులు



సాయిబాలాజీ కడచూపునకు తరలివచ్చిన గ్రామస్థులు

గొలుగొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): చేతికి అందివచ్చిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబీకులు శోకసంద్రంలో మునిగిపోయారు. గొలుగొండ గ్రామానికి చెందిన యువకుడు గండెం సాయిబాలాజీ (23) యువకుడు ఇంజనీరింగ్ పూర్తి చేసుకుని నాలుగు నెలల క్రితం అనకాపల్లి జిల్లా తాళ్లపాలెం సిమెంట్ ఫ్యాక్టరీలో పార్ట్‌టైం ఉద్యోగం చేసుకుంటున్నాడు. గురువారం స్నేహితుడు వివాహానికి హాజరై తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఈ విషయం తెలియగానే కుటుంబ సభ్యులు, బంధువులు శోక సంద్రంలో మునిగిపోయారు. సాయిబాలాజీ తండ్రి గండెం ఈశ్వరరావు గొలుగొండకు ఎంపీటీసీ సభ్యుడిగా పనిచేశారు. ఆయనకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సాయిబాలాజీ ఇటీవల నిర్వహించిన గ్రూప్-2 పరీక్షల్లో ప్రతిభ కనబర్చాడు. ప్రభుత్వం ఉద్యోగం వచ్చే సమయంలో తన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబీకులు శోకసముద్రంలో మునిగిపోయారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేశ్, జడ్పీటీసీ సభ్యుడు సుర్ల వెంకటగిరిబాబు, అధిక సంఖ్యలో గ్రామస్థులు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

ఏపీఐఐసీ భూముల్లో పనులు ప్రారంభం

మాకవరపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ భూముల్లో శుక్రవారం పనులను ప్రారంభించారు. గతంలో రాచపల్లి రెవెన్యూ పరిధిలో పయనీర్ కంపెనీ భూసేకరణ నిమిత్తం తీసుకున్న భూమిలో ఏపీఐఐసీ పరిధిలో సుమారు 300 ఎకరాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రతీ మండలంలో పారిశ్రామిక సంస్థల ఏర్పాటు నిమిత్తం ఈ భూమిలో పనులు ప్రారంభించినట్టు టీడీపీ నాయకులు తెలిపారు. ఇటీవల ఈ భూమిని బీడీఎల్ కంపెనీ యాజమాన్యం పరిశీలించింది. ఈ నేపథ్యంలోనే భూమిలో పనులు ప్రారంభం కావడంతో ఇక్కడ బీడీఎల్ కంపెనీ వస్తుందనే ప్రచారం జరుగుతోంది. అయితే రామన్నపాలెం, వెంకయ్యపాలెం, ఎరకన్నపాలెం, చినరాచపల్లి గ్రామాలకు ఆనుకొని ఉన్న 300 ఎకరాల భూమి ఏపీఐఐసీ అధీనంలో ఉంది. ఈ భూమిని చదును చేసే పనులు ప్రారంభం కావడంతో స్థానిక నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఏపీఐఐసీ భూముల్లో తుప్పలను తొలగిస్తున్న దృశ్యం

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆందోళన

కశింకోట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కశింకోటలో శుక్రవారం పలు సంఘాలు ఆందోళన చేపట్టాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి.వరలక్ష్మి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అదానీ కంపెనీకి లాభం చేకూర్చేందుకు ఈ స్మార్ట్ మీటర్లను బిగిస్తుందని ఆరోపించారు. ఇప్పటికే కొన్ని మండలాల్లో అమర్చడం వల్ల విద్యుత్ బిల్లులు భారీగా వస్తుండడంతో ఆయా వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారన్నారు. ప్రజలంతా ఈ మీటర్లను వ్యతిరేకించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అప్పారావు, చిరంజీవి, నూకరాజు, శివ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'పెన్షన్‌దారుల సమస్యలు పరిష్కరించాలి'

మాకవరపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని పెన్షన్‌దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్నాథరావు డిమాండ్ చేశారు. శుక్రవారం తామరంలో పెన్షన్‌దారుల సంఘం 20వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు విడతులుగా కరువు బత్యం ఇవ్వాలని, పింఛన్ దారులను చిన్నచూపు చూడవద్దని అన్నారు. వారు కూడా ఓటర్లేనని గుర్తించాలని అన్నారు. అనంతరం సంఘం 20 వసంతాలు పూర్తి చేసుకోవడంతో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్షన్‌దారుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బూరుగుపాలెం హైస్కూల్ విద్యా కమిటీ ఛైర్మన్ ఎన్నిక

మాకవరపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో బూరుగుపాలెం హైస్కూల్ విద్యా కమిటీ ఛైర్మన్‌గా లగుడు రత్నం ఎన్నికైనట్టు హైస్కూల్ ప్రధానోపాధ్యాయరాలు మహాలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంతకముందు ఉన్న హైస్కూల్ విద్యాకమిటీ ఛైర్మెన్ అనారోగ్యంతో మృతిచెందారని తెలిపారు. ఈ నేపథ్యంలో కొత్త ఛైర్మన్‌ను శుక్రవారం ఎన్నుకున్నామని తెలిపారు. పాఠశాల మొత్తం ఏకగ్రీవంగా లగుడు రత్నాన్ని ఎన్నుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఛైర్మన్‌ను ఎంఈవో మూర్తి, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి చిరంజీవి, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రొటోకాల్ రగడ

సచివాలయ ఉద్యోగులపై ఎంపీపీ మండిపాటు

దేవరాపల్లి, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఎ.కొత్తపల్లిలో సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీకి సమాచారం ఇవ్వకుండా నూతన పెన్షన్లను సచివాలయ సిబ్బంది, అధికార పార్టీ కార్యకర్తలతో పంపిణీ చేశారంటూ ఎంపీపీ చింతల బుల్లి.లక్ష్మి, సర్పంచ్ వెంకటరమణ ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీడీవో అక్కడకు చేరుకోవంతో ప్రొటోకాల్ పాటించకపోవడానికి కారణాలు ఏమిటని ప్రశ్నించడంతో, ఇకపై ఇటువంటి జరగవని సచివాలయ సిబ్బంది బదులిచ్చింది.

'పరిసరాల పరిశుభ్రతకు ముందుకు రావాలి'

చీడికాడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ పరిసరాల పరిశుభ్రతకు మహిళలు ముందుకురావాలని ఎంపీడీవో హేమసుందర్రావు కోరారు. జి.కొత్తపల్లి గ్రామంలో పారిశుధ్య కార్మికులతో ఆయన ఇంటింటికి వెళ్లి కార్మికులకు తడి, పొడి చెత్తలను వేరువేరుగా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపెంట, ములకలాపల్లి, ఎన్.గజపతినగరం గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈఈ కె.శంకరరావు తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

దేవరాపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) మండలంలోని తెనుగుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే స్టడీ మెటీరీయల్‌ను సిరి ఫౌండేషన్ శుక్రవారం అందజేసింది. 'నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్' పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు నెలకు రూ.1000 చొప్పున స్కాలర్‌షిప్‌ను సిరి ఫౌండేషన్ అందజేస్తుందని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో

సక్రమంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ

» కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం



పిసినికాడలో వృద్ధురాలికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

కొత్తూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు సక్రమంగా, సకాలంలో పంపిణీ చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనకాపల్లి మండలం పిసినికాడలో పింఛన్ల పంపిణీని పరిశీలించిన ఆమె.. పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ డబ్బులు అందజేశారు. పింఛన్లు పంపిణీ చేసే క్రమంలో సచివాలయ సిబ్బంది డబ్బులు ఏమైనా అడుగుతున్నారా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ కె.శచీదేవి, ఉప మండల అభివృద్ధి అధికారి ప్రసాద్, తహశీల్దార్ ఎం.బి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో సంతోషిమాత

అనకాపల్లి టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం రెండు శుక్రవారాన్ని పురస్కరించుకుని స్థానిక గవరపాలెం సంతోషిమాత ఆలయంలో అమ్మవారు శుక్రవారం శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ఈవో బి.మురళీకృష్ణ, మాజీ చైర్మన్ మారిశెట్టి భాస్కరరావుల ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ తోపాటు పలువురు భక్తులు ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించిన దృశ్యం →



ఎంఈవో-1 పోస్టులను సీనియారిటీ ప్రకారం భర్తీ చేయాలి

» పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీ నాథ్ డిమాండ్



జిల్లా పరిషత్ ఉన్నపాఠశాలలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

నర్సీపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల సర్వీసు సీనియార్టీని ప్రకారం ఎంఈవో-1 పోస్టులు భర్తీ చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జడ్పీ మెయిన్ స్కూల్‌లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు పెట్టుకొని ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఈవో-1 పోస్టులను ప్రభుత్వ యాజమాన్యం పరిధిలోని స్కూల్ అసిస్టెంట్లను ఎఫ్ఏసీలుగా తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల ఉమ్మడి సీనియార్టీ ప్రకారం ఎంఈవో-1లను నియమించాలని డిమాండ్ చేశారు. సర్వీసులో సీనియారిటీ కలిగిన పంచాయతీరాజ్ ప్రధానోపాధ్యాయులను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం ప్రభుత్వ పాఠశాలల స్కూల్ అసిస్టెంట్లని నియమించడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ అల్లు అప్పారావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కురచ రమణ, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు అడిగర్ల వరహాల నాయుడు, జీవీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లంగనులు!

... 3వ పేజీ తరువాయి

సమీపంలో వున్న ఇళ్లపై రాళ్లు పడుతున్నాయి. ఇటువంటి సమస్య మార్టూరు, మామిడిపాలెం, సీతానగరం, రొంగలివానిపాలెం గ్రామాల్లో అధికంగా వుంది.

మార్టూరు సర్వే నంబరు-1లో నాలుగు రాయి క్వారీలను అనధికారికంగా నడుపుతున్నారు. తుమ్మపాల సర్వే నంబరు-4లో క్వారీకి అనుమతి ఉందని చెప్పుకొంటూ కొందరు మార్టూరులో, అదే విధంగా మాకవరంలో 70వ సర్వే నంబరు, మామిడిపాలెంలో 109వ సర్వే నంబరులో కొంతమంది స్థానిక నాయకులు అనధికార క్వారీలను నిర్వహిస్తున్నారు. రేబాక రెవెన్యూ పరిధిలోని సీహెచ్ఎన్ అగ్రహారం, కోడూరు రెవెన్యూ కొండుపాలెం పరిసరాల్లో అనధికార క్రషర్లను ఏర్పాటు చేసి, రోడ్డు మెటల్, బేబీ చిప్స్ వంటివి ఉత్పత్తి చేస్తున్నారు. గనులు, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు, సిబ్బంది ఆయా క్వారీలు, క్రషర్ల నిర్వాహకుల నుంచి నెలవారీ మామూళ్లు తీసుకుంటూ, అక్రమాలను ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అసంపూర్తి రోడ్డుతో గిరిజనుల అవస్థలు

» పనులు మధ్యలో ఆపేసిన కాంట్రాక్టర్

» శ్రమదానంతో గోతులు పూడ్చుకుంటున్న గిరిజనులు



కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేసిన రోడ్డులో గోతులను పూడ్చుకుంటున్న నేరేడుబంద గిరిజనులు

రావికమతం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా వదిలేసిన నేరేడుబంద రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆ గ్రామ గిరిజనులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.. చీమలపాడు పంచాయతీ శివారు కొండ శిఖరంపై ఉన్న నేరేడుబంద గ్రామంలో 15 కుటుంబాలకు చెందిన 60 మంది నివసిస్తున్నారు. రహదారి సౌకర్యం లేకపోవడంతో పంచాయతీకి, మండల కేంద్రాలకు, ఆస్పత్రికి వెళ్లాలంటే డోలీ మోతలు తప్పనిసరి. గ్రామంలో పాఠశాల లేకపోవడంతో కొండ దిగువన మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న జడ్.జోగుంపేట పాఠశాలకు రోజూ వెళ్లి వస్తున్నారు. తమ గ్రామానికి రహదారి నిర్మించి, ఇబ్బందులు తొలగించాలని గిరిజనులు పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తులు చేశారు. మండల కేంద్రానికి వచ్చి ఆందోళనలు చేశారు. ఎట్టకేలకు గత ఏడాది డిసెంబరులో నేరేడుబందకు రోడ్డు నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద రూ.2.5 కోట్లు మంజూరు చేసింది. చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఈ ఏడాది జనవరిలో శంకుస్థాపన చేశారు. టెండర్ ద్వారా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్.. మట్టి రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇది పూర్తి చేసిన తరువాత బీటీ రోడ్డు వేయాలి. కానీ మట్టి రోడ్డు నిర్మాణంతో పనులు ఆపేశారు. వర్షాకాలం కావడంతో రహదారి బురదమయమై నడవడానికి కూడా వీలుకాక ఇబ్బందులు పడుతున్నట్టు గిరిజనులు వాపోతున్నారు. కొన్నిచోట్ల గోతులమయం కావడంతో శ్రమదానంతో పూడ్చుకుంటున్నారు. ఎమ్మెల్యే రాజు స్పందించి, తమ గ్రామానికి రహదారి నిర్మాణ పనులు పూర్తిచేయించాలని నేరేడుబంద గిరిజనులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఐఎంయూ ఎదుట రైతుల ధర్నా

» ఉద్యోగ, ఉపాధి కల్పన హామీలను నెరవేర్చాలని డిమాండ్



ఇండియన్ మారిటైం వర్సిటీ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నిర్వాసిత రైతులు

సబ్బవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మారిటైం యూనివర్సిటీ (ఐఎంయూ) ఏర్పాటు కోసం పదిహేనేళ్ల క్రితం భూములు ఇచ్చిన తమకు ఇంతవరకు న్యాయం చేయలేదంటూ పలువురు రైతులు శుక్రవారం వర్సిటీ మెయిన్ గేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అధికారులు, వర్సిటీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు ఆకుల గణేశ్, జెట్టి శ్రీనివాసరావు, ప్రసాద్, ముత్యాలనాయుడు, నరసింగరావు తదితరులు మాట్లాడుతూ.. 2011లో వర్సిటీ నిర్మాణానికి 110 ఎకరాలను అధికారులు సేకరించారని గుర్తు చేశారు. వర్సిటీలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అప్పటి కలెక్టర్, జేసీ, వర్సిటీ ఉన్నతాధికారులు హామీ ఇచ్చారన్నారు. విశ్వవిద్యాలయం ప్రారంభమై పదేళ్లు అవుతున్నప్పటికీ భూములు ఇచ్చిన రైతుల కుటుంబాకు ఉద్యోగ, ఉపాధి కల్పించలేదన్నారు. పలుమార్లు ఆందోళలు చేయగా.. కొద్ది మందికి మాత్రమే ఉపాధి కల్పించారన్నారు. గత జనవరిలో వారం రోజులపాటు ఇక్కడ ధర్నా చేయగా.. 11 డిమాండ్లు పరిష్కరిస్తామని స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సమక్షంలో వర్సిటీ అధికారులు రాతపూర్వకంగా హామీ ఇచ్చారన్నారు. ఇది జరిగి ఏడు నెలలు అయినా.. హామీలను నెరవేర్చలేదని అన్నారు. పంట భూములు లేకపోవడంతో ఉపాధి కోసం విశాఖపట్నం, గాజువాక వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పది రోజుల్లో హామీలను అమలుచేయకపోతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

పకడ్బందీగా రీ-సర్వే

» భూ సమస్యలన్నిటికీ పరిష్కారం

» సర్వే శాఖ సబ్ డివిజనల్ ఏడీ గోవిందరావు



సమావేశంలో మాట్లాడుతున్న సర్వే శాఖ సబ్ డివిజనల్ అదనపు డైరెక్టర్ గోవిందరావు

సబ్బవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): భూమలు రీ-సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నామని సర్వే శాఖ సబ్ డివిజనల్ అడిషనల్ డైరెక్టర్ (అమరావతి) ఆర్.గోవిందరావు పేర్కొన్నారు. మండలంలో రీసర్వేకు పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన మండలంలోని గుల్లేపల్లిలో ఆయన శుక్రవారం పర్యటించారు. రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రీ-సర్వేతో భూ సంబంధిత సమస్యలన్నీ పరిష్కారం అవుతాయన్నారు. భవిష్యత్తులో ఎటువంటి వివాదాలు తలెత్తకుండా రికార్డులు తయారు చేస్తామన్నారు. ప్రతి రైతు పేరున ఎల్‌పీఎం నంబరు కేటాయిస్తామని, భూముల వివరాలన్నీ ఇందులో వుంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో షేక్ ఆయిషా, తహశీల్దార్ బి.చిన్నికృష్ణ ఎంపీపీ బోకం సూర్యకుమారి, సర్పంచ్ బండారు మంగ, జిల్లా సర్వే అధికారి గోవిందరాజు, తదితరులు పాల్గొన్నారు.

5 ఐటీ సంస్థలకు భూ కేటాయింపులు

» ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

» సిఫీ ఇన్ఫినిటీ స్పేస్‌కు రుషికొండ, పరదేశిపాలెంలలో 53.6 ఎకరాలు... పెట్టుబడి రూ.15,266 కోట్లు

» బీవీఎం ఎనర్జీకి పనోరమ హిల్స్ వద్ద 30 ఎకరాలు



రుషికొండ ఐటీ హిల్ నంబర్-3

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విశాఖను ఐటీ హబ్‌గా మార్చాలని పలు సంస్థలకు ఇక్కడ భూములు కేటాయిస్తూ వారం క్రితం రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. వాటిపై శుక్రవారం ప్రత్యేకంగా జీఓలు జారీచేసింది. మొత్తం ఐదు సంస్థలకు భారీగా భూములు ఇచ్చింది. కొన్నింటికి మూడేళ్లలో ఆపరేషన్లు ప్రారంభించాలనే నిబంధన పెట్టింది. కొందరికి ఎకరా రూ.50 లక్షలకు, మరికొందరికి రూ.1.5 కోట్లకు, ఇంకొందరికి రూ.4.05 కోట్ల చొప్పున ధర నిర్ణయించింది. ఒక సంస్థకు ఎకరా 99 పైసలకే ఇవ్వడం గమనార్హం.

- ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థకు కేవలం 99 పైసలకు ఎకరా భూమి ఇచ్చారు. రుషికొండ హిల్ నంబరు 3లో 2.5 ఎకరాలు, మధురవాడ హిల్ నంబరు 4లో 7.79 ఎకరాలు కేటాయించారు. వీరి పెట్టుబడి రూ.వేయి కోట్లు. పది వేల మందికి ఉద్యోగాలు ఇవ్వాలి. ప్రధాన కార్యాలయం నిర్మించి మూడేళ్లలో ఆపరేషన్లు ప్రారంభించాలని నిబంధన పెట్టారు. ఇక్కడ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు చెందిన సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ వస్తుంది.
- సిఫీ ఇన్ఫినిటీ స్పేస్ లిమిటెడ్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తుంది. వీరికి రుషికొండ హిల్ నంబరు 3లో 3.6 ఎకరాలు ఎకరా కోటి రూపాయలకు ఇచ్చారు. పరదేశిపాలెంలో 50 ఎకరాలు కేటాయించారు. వీరి పెట్టుబడి రూ.15,266 కోట్లు కాగా ఇచ్చే ఉద్యోగాలు 600. రెండేళ్లలో ఆపరేషన్లు ప్రారంభించాలి. పరదేశిపాలెం సర్వే నంబరు 134లో ముందుగా 25 ఎకరాలు ఎకరా రూ.50 లక్షలకు ఇచ్చారు.
- కపిల్ చిట్‌ఫండ్ గ్రూపునకు చెందిన బీవీఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీకి ఎండాడలో పనోరమ హిల్స్ వెనుక ఒకే దగ్గర ఏపీఐఐసీ ద్వారా 30 ఎకరాలు కేటాయించారు. అందులో వరల్డ్ ట్రేడ్ సెంటర్ నిర్మిస్తారు. ఆఫీస్ స్పేస్, కో వర్కింగ్ స్పేస్, ఉద్యోగులకు నివాసాలు, స్టార్ హోటల్ వంటివి నిర్మిస్తారు. వీరి పెట్టుబడి రూ.1,250 కోట్లు కాగా 15 వేల మందికి ఉపాధి కల్పించాలి. ముందుగా సర్వే నంబరు 179/2లో పది ఎకరాలు ఇచ్చారు. ఎకరాకు రూ.1.5 కోట్లు ధర నిర్ణయించారు. వీరు 25 లక్షల చ.అ. విస్తీర్ణంలో నిర్మాణాలు చేపడతారు. కోట్లకే ఇచ్చారు.
- ఫీనమ్ పీపుల్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ఐటీ క్యాంపస్ నిర్మాణానికి ముందుకు రాగా 4.45 ఎకరాలు కేటాయించారు. రుషికొండ హిల్ నంబరు 2లోని నాన్ సెజ్ ఏరియాలో 45 సెంట్లు, మధురవాడ హిల్ నంబరు 4లో నాలుగు ఎకరాలు ఇచ్చారు. ఎకరాకు రూ.4.05 కోట్లు ధర నిర్ణయించారు. వీరి పెట్టుబడి 2078.5 కోట్లు కాగా దశల వారీగా ఐదేళ్లలో 2,500 మందికి ఉద్యోగాలు కల్పించాలి. ఏడాదిలో క్యాంపస్ ఏర్పాటు చేసి, రెండేళ్లలో 1,250 మందికి ఉపాధి చూపించాలి.

సత్వ డెవలపర్స్‌కు 30 ఎకరాలు

- సత్వ డెవలపర్స్‌కు ఐటీ స్పేస్, డేటా సెంటర్ ఏర్పాటు కోసం మధురవాడలోని హిల్ నంబరు 4లో 30 ఎకరాలు, ఎకరా రూ.1.5 కోట్లు చొప్పున ఇచ్చారు. వీరు రూ.1,500 కోట్ల పెట్టుబడితోనే 25 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మూడేళ్లలో 10 లక్షల చ.అ. స్థలం, ఐదేళ్లలో 90 లక్షల చ.అ. నిర్మాణం పూర్తిచేయాలి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

... 3వ పేజీ తరువాయి

బాలాజీ మృతిచెందాడు. రవికి ప్రథమ చికిత్స చేసిన అనంతరం వైద్యుల సూచన మేరకు విశాఖలో ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

కాగా చేతికి అందివచ్చిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో నాగసాయిబాలాజీ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఇంజనీరింగ్ పూర్తిచేసిన ఇతను నాలుగు నెలల క్రితం సిమెంట్ ఫ్యాక్టరీలో చేరాడు. ఇతని తండ్రి ఈశ్వరరావు గతంలో ఎంపీటీసీ సభ్యునిగా పనిచేశారు. ఇద్దరు కుమారుల్లో పెద్దవాడైన సాయిబాలాజీ రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. మరో మృతుడు వెంకటసూరిఅప్పారావు తల్లిదండ్రులు లోవరాజు, లక్ష్మి వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. కుమారుడికి పెళ్లి సంబంధాలు చూస్తున్న తరుణంలో రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడంతో కన్నీరుమున్నీరు అయ్యారు. నాగసాయి బాలాజీ తల్లి అచ్చెయ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ట్రాఫిక్ ఎస్ఐ శేఖరం తెలిపారు.

సీసీ టీవీ ఫుటేజీలతో వ్యాన్ గుర్తింపు

ప్రమాదానికి కారణమైన ఐషర్ వ్యాన్‌ను సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా తెలంగాణలోని మేడ్చల్ ప్రాంతానికి చెందినదిగా పోలీసులు గుర్తించారు. జాతీయ రహదారిపై పలుచోట్ల వున్న సీసీ కెమెరాలతోపాటు నక్కపల్లి మండలం వేంపాడు టోల్ ప్లాజా వద్ద వున్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి నిర్ధారణకు వచ్చారు. అన్ని జిల్లాల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎన్టీఆర్ జిల్లా పోలీసులు వ్యాన్‌ను అదుపులోకి తీసుకున్నారని, వాహనంతోసహా డ్రైవర్‌ను ఇక్కడకు తీసుకువచ్చేందుకు పోలీసు సిబ్బంది వెళ్లారని ఎస్ఐ శేఖరం తెలిపారు. మృతదేహాలకు ఎన్టీఆర్ వైద్యాలయంలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

క్రైం... crime news

విద్యుత్ షాక్‌తో కొత్తకోటవాసి మృతి

» విశాఖలోని కంచరపాలెం వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో ప్రమాదం

» కొత్తకోటలో విషాద వాతావరణం



రమణ (ఫైల్‌ఫొటో)

కంచరపాలెం/రావికమతం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలోని కంచరపాలెం ఐటీఐ జంక్షన్ వద్ద వాటర్ సర్వీసింగ్ కేంద్రంలో పనిచేస్తున్న భీమరాతి రమణ (41) శుక్రవారం ఉదయం విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. అనకాపల్లి జిల్లా రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన రమణ కంచరపాలెం సమీపంలోని సిద్ధార్థనగర్ ప్రాంతంలో భార్య, పిల్లలతో కలిసి నివసిస్తున్నాడు. కుంచుమాంబ వాటర్ సర్వీసింగ్ కేంద్రంలో పనిచేస్తున్న ఇతడు ఉదయం 8 గంటల ప్రాంతంలో కారును శుభ్రపరుస్తుండగా విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మతిచెందాడు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కంచరపాలెం సీఐ రవికుమార్, ఎస్ఐ రవికుమార్‌లు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. రమణకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పొట్టకూటికోసం పదేళ్ల కిందట నగరానికి వచ్చిన రమణ చిన్న చిన్న ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. రెండేళ్లగా వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. కుటుంబానికి ఆధారమైన భర్త విద్యుత్‌షాక్‌తో మృతిచెందడంతో అతని భార్య సత్యవతి, కుమారులు జశ్వంత్, సుశ్మిత్‌లు విలపించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

» 3.5 తులాల బంగారం, రూ.45 వేల నగదు స్వాధీనం



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, నగదు

పరవాడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో వారం రోజుల వ్యవధిలో రెండు చోట్ల పట్టపగలు చోరీలకు పాల్పడిన నిందితుడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అతని నుంచి మూడున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.45 వేల నగదు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను పరవాడ ఇన్‌చార్జి డీఎస్పీ బి.మోహన్‌రావు శుక్రవారం ఇక్కడ పోలీసు స్టేషన్‌ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు.

చోడవరం యడ్లవీధికి చెందిన సబ్బవరపు కృష్ణంనాయుడు తల్లిదండ్రులు 20 ఏళ్ల క్రితంమే ఉపాధి నిమిత్తం విశాఖలోని కంచరపాలెం ప్రాంతానికి వలస వెళ్లారు. డిగ్రీ వరకు చదువుకున్న కృష్ణంనాయుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడి డబ్బులు పోగొట్టుకున్నాడు. అక్రమంగా డబ్బు సంపాదించాలన్న ఉద్దేశంతో గత నెల 22న పరవాడ సినిమాహాల్ జంక్షన్‌కు సమీపంలో తాళం వేసి ఉన్న పైలా సన్యాసిరావు ఇంటిలో చొరబడి మూడున్నర తులాల బంగారం వస్తువులతోపాటు రూ.50 వేల నగదు అపహరించుకుపోయాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా సీసీ టీవీ ఫుటేజీల సాయంతో నిందితుడిని, అతను వినియోగించిన ద్విచక్ర వాహనాన్ని గుర్తించి గాలింపు చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా గత నెల 29న పరవాడ పరదేశిమాంబ ఆలయం సమీపంలో రెడ్డి అప్పారావు ఇంటిలో కూడా కృష్ణంనాయుడు చోరీకి పాల్పడ్డాడు. బీరువాలో వున్న అర తులం బంగారం చెవిదిద్దులు, రూ.60 వేల నగదు, మరికొన్ని వస్తువులు అపహరించుకుపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్నం పరవాడ సినిమాహాల్ జంక్షన్ వద్ద తచ్చాడుతున్న కృష్ణంనాయుడును పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. రెండుచోట్ల చోరీలకు పాల్పడినట్టు అంగీకరించాడు. అతని నుంచి మూడున్నర తులాల బంగారు వస్తువులు, రూ.45 వేల నగదు, మరికొన్ని వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇతనిపై ఇప్పటికే చోడవరంలో దొంగతనం కేసు నమోదైనట్టు పోలీసుల విచారణలో తేలింది. సమావేశంలో సీఐ ఆర్.మల్లికార్జునరావు, ఎస్ఐ మహలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లర్ ఆస్తులు రూ.1.4 కోట్లు సీజ్

» అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్



పాడేరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా, వ్యాపారం ద్వారా సంపాదించిన ఓ నిందితుడికి చెందిన రూ.1 కోటి 40 లక్షల విలువైన ఆస్తులను సీజ్ చేశామని జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుడు పెరుమాళ్ శ్రీను గంజాయి రవాణా, వ్యాపారం చేస్తుండడంతో అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాలతో పాటు ఒడిశా రాష్ట్రం పాడువాలో, తెలంగాణ రాష్ట్రం దమ్మపేటలో గంజాయి కేసులు నమోదయ్యాయన్నారు. ఈ క్రమంలో పెరుమాళ్ శ్రీనుపై ప్రత్యేక విచారణ చేపట్టి, ఆయనకున్న ఆస్తులను గుర్తించామన్నారు. చట్టప్రకారం ఆయన గంజాయి స్మగ్లింగ్ ద్వారా సంపాదించిన రూ.1 కోటి 40 లక్షల ఆస్తులను సీజ్ చేశామని, వాటి క్రయవిక్రయాలకు అవకాశం లేకుండా ఫ్రీజ్ చేశామన్నారు. అలాగే ప్రజలు ఏదైనా ఆస్తులను కొనుగోలు చేస్తున్న క్రమంలో వాటి యాజమాని గురించి పక్కాగా తెలుసుకోవాలని, లేకుంటే చట్టపరమైన చిక్కుల్లో పడతారన్నారు. అలాగే ముఖ్యంగా గంజాయి స్మగ్లర్ల ఆస్తులను ఎవరూ కొనుగోలు చేయవద్దని, ప్రజలు పోలీసులకు సహరించాలని ఎస్పీ తెలిపారు.

హోటళ్లు, రెస్టారెంట్స్‌లో నిల్వ ఆహారం

» ఆహార భద్రత, ప్రమాణాల శాఖ తనిఖీల్లో గుర్తింపు

» 17 హోటళ్లపై కేసులు నమోదు



అధికారుల తనిఖీల్లో గుర్తించిన నిల్వ ఆహార పదార్థాలు

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లపై శుక్రవారం ఆహార భద్రత, ప్రమాణాల శాఖ, తూనికలు, కొలతల శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఆహార భద్రత, ప్రమాణాల శాఖ జాయింట్ ఫుడ్ కంట్రోలర్ ఎన్.పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో 20 బృందాలు 40 హోటళ్లు, రెస్టారెంట్లలో సోదాలు చేపట్టాయి. అనేక హోటళ్లలో చికెన్, మటన్‌లతో తయారుచేసిన ఆహార పదార్థాలను రోజుల తరబడి నిల్వ ఉంచుతున్నట్టు గుర్తించిన అధికారులు వాటి నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీకి పంపించారు. ఈ సందర్భంగా 17 హోటళ్లపై అధికారులు కేసులు నమోదుచేశారు. ఈ దాడుల్లో ఇటు శ్రీకాకుళం నుంచి అటు ఎన్టీఆర్ జిల్లా వరకు ఉన్న అధికారులంతా పాల్గొన్నారు. శనివారం కూడా ఈ దాడులు కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు. నగర పరిధిలోని హోటల్స్, రెస్టారెంట్స్‌లో భారీగా నిల్వ ఉంచిన ఆహారాన్ని విక్రయిస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ దాడులు చేపట్టినట్టు చెబుతున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	83.00
లైవ్ ధర	103.00
విత్ స్కిన్	176.00
స్కిన్ లెస్	186.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469